


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## మూడుముళ్ల బంధంతో ఒక్కటైన విరోష్






ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 58 | శుక్రవారం 27 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


# ఫించను పెంపు!

దశల వారీగా చేయూత పింఛను
పెంచనున్న ప్రభుత్వం
తొలి విడతలో రూ.500
పెంచాలన్న యోచన
బడ్జెట్‌లో కేటాయింపులు చేసే అవకాశం
ప్రస్తుత పింఛన్ రూ.2,016..
దివ్యాంగులకు 4,016
ఏడాదికి అవుతున్న మొత్తం వ్యయం
రూ.11,400 కోట్లు
రూ.500 పెంచితే అదనంగా.. ఏటా
సుమారు రూ.2500 కోట్లు అవసరం
విడతల వారీగా 'చేయూత'
రూ.4 వేలకు పెంపు 2లో



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2016 చొప్పున, దివ్యాంగులకు రూ. 4016 చొప్పున పింఛను




## ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

### ఇన్‌స్టాలో వంద మిలియన్లు దాటిన ఫాలోవర్లు

భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు),

వంశధార నుంచి పెన్నా వరకూ
నదులను అనుసంధానించాలి
పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుతో మేలు
కాళేశ్వరం కట్టినా మేం అభ్యంతరం చెప్పలేదు
గోదావరిలో వృథా జలాలు వినియోగంలోకి తెస్తాం
నదుల అనుసంధానంతో తెలుగుతల్లికి జలహారతి పడతా
తాగు,సాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణం
సాగునీటి రంగంపై శాసనసభలో సీఎం చంద్రబాబు 2లో



# నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

పోలవరం – నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరోమారు స్పష్టం చేశారు. గోదావరి నుంచి సముద్రంలోకి వెళ్లే వృథాగా వరద జలాలను.. ఆయా ప్రాజెక్ట్‌లకు తరలిస్తామని పేర్కొన్నారు. గోదావరిపై ఎగువన తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, దీనికి తాము అభ్యంతరం చెప్పలేదని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ దీని వల్ల లాభం కలుగుతుందని ఉద్ఘాటించారు. పోలవరం – నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకి పొరుగు రాష్ట్రం అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనదని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరికి అఖండ హారతి ఇచ్చామని, కృష్ణాకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడారు. గంగా– కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని చెప్పారు. ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది. గంగా–కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయి.



# తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించినఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభమవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన

పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు
ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది
అసెంబ్లీలో మీ పక్షాన
పోరాడుతాం
కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా
నిలబడతాం
వెలుగుమట్ల బాధితులను
పరామర్శించిన కెటిఆర్ 2లో

# అధికారంలోకి వస్తే.. రక్తంతో హోలీ!



## జగన్ నెల్లూరు పర్యటనలో 'రప్పా.. రప్పా' నినాదాలతో వైసీపీ కార్యకర్తల వీరంగం

ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు గురువారం నెల్లూరుకు వచ్చిన వైసీపీ అధ్యక్షుడు జగన్ పర్యటనలో ఆ పార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలు 'రప్పా.. రప్పా' నినాదాలతో వీరంగం చేశారు. 'మీరు అధికారంలోకి వస్తే రక్తంతో హోలీ ఆడాలి' అంటూ నినాదాలు చేశారు. అంతేగాక బారికేడ్లు గోడలను దూకి జగన్ హెలిప్యాడ్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారందరినీ అదుపులోకి తీసుకొని పోలీసస్టేషన్‌కు తరలించారు. అనంతరం హెచ్చరించి వదిలేశారు. జగన్ గురువారం ఉదయం హెలిక్యాప్టర్‌లో నెల్లూరు కనుపర్తిపాడుకు చేరుకొన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన వీపీఆర్ కల్యాణమండంలో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని, తిరిగి 11 గంటల ప్రాంతంలో బెంగళూరు వెళ్లిపోయారు.



## దక్షిణాదిపై జనసేన గురి

# 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్'

మూడో విడత సభ్యత్వ
నమోదుకు జనసేన శ్రీకారం
ఏపీ, టీజీ, తమిళనాడు,
కర్ణాటక, మహారాష్టలలో
సభ్యత్వ నమోదు కార్యక్రమం
ఉద్యమి, సాధక్, ప్రదాత
పేర్లతో మూడు వర్గాలుగా
సభ్యత్వాలు 2లో



## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

### వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం

2లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర

## ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ మీడియట్ బోర్డు సెక్రటరీ తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు

## జూబ్లీహిల్స్ లో భారీ అగ్నిప్రమాదం..

జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ పరిధిలో
భారీ అగ్నిప్రమాదం 2లో
రోడ్ నంబర్ 36లో ఉన్న మంగళ గౌరీ షాపింగ్
మాల్లో భారీగా ఎగసిపడుతున్న మంటలు
ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి
తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది




## ఐపీఎస్ సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్



రఘురామ కస్టోడియల్
టార్చర్ కేసు
బీహార్ కేడర్ ఐపీఎస్
సునీల్ నాయక్‌కు నాన్
బెయిలబుల్ వారెంట్ జారీ
చేసిన గుంటూరు కోర్టు
సునీల్ నాయక్ కోసం
పాట్నాలోనే మకాం వేసిన
ఏపీ పోలీసులు 9లో

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు




మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి 2లో

# నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయి. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా తెదేపా హయాంలోనే జరిగాయి. పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చాం. వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా... నేనే పూర్తి చేస్తున్నా. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నారు. గోదావరి జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 2047 విజన్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రధానంగా నీటి భద్రతపైనే దృష్టి సారించిందని సీఎం వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించే బాధ్యత తమ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి ఇవ్వడం ద్వారా జలాలను అత్యంత విలువైన వనరుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి నది నుంచి సగటున ఏడాదికి 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని వివరించారు. వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలో నదులను అనుసంధానిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గంగా-కావేరీ అనుసంధానం జరగాలన్నది తన ప్రగాఢమైన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. గంగా - కావేరి అనుసంధానం సాధ్యా సాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయని ప్రస్తావించారు. నదులు అనుసంధానం చేసి, తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా 738 కిలోమీటర్ల మేర కాలువలను విస్తరించి కుప్పంలో పరమ సముద్రం చెరువు వరకూ నీరిచ్చామని వివరించారు. మడకశిర వరకూ నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంత దాహార్తిని తీర్చామన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు చేపట్టినట్లు ప్రస్తావించారు. సాగునీటిపై 2014 నుంచి 2019లో రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. గడిచిన 20 నెలలుగా రూ.20 వేల కోట్ల వరకూ ఖర్చు చేయగలిగామని వివరించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకూ నీరిచ్చి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేసి 100 టీఎంసీలను రాయలసీమకు తరలించామని వెల్లడించారు. అందుకే ఆ ప్రాంతం రతనాల సీమగా మారిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి మార్కాపురంతో సహా వివిధ ప్రాంతాలకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు భరోసా కల్పించారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా మార్కాపురం, ఒంగోలు జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. 30 ఏళ్ల ముందు ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి.. మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2500 కోట్ల మేర ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని వివరించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ క్రెడిట్ మొత్తం వైసీపీనే చోరీ చేస్తోందని ఆగ్రహించారు. వెలిగొండకు నీళ్లు రాకుండానే జగన్ రెడ్డి రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. కుప్పం లోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో పోశారని విమర్శించారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. డయాఫ్రాం వాల్‌ను గోదాట్లో కలిపేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఆ ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నామని చెప్పుకొచ్చారు. పుష్కరాలకంటే ముందు ఆ ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని మాటిచ్చారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. 1312 టీఎంసీల నీటిని ఏపీ ప్రాజెక్టుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం 793 టీఎంసీల నీటితో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయి. మే 15 తేదీన నారుమళ్లకు నీరిచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. 16 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సాగుతో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉంది. నీటి నిర్వహణ నుంచి పొదుపు చేసే వరకూ నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తున్నాం. ఏపీ వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపునకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సగటున 7 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భజలాలు గణనీయంగా పెరగటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల ద్వారా వినియోగం కూడా తగ్గింది. తద్వారా రూ.91 కోట్ల మేర విద్యుత్ కూడా ఆదా అయ్యింది. ఏపీలో 50 శాతం గ్రీన్ కవర్ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్క తిరుమలలోనే 89 శాతం మేర పచ్చదనం ఉంది. గత పాలనలో గుండ్ల కమ్మ గేట్లు కొట్టుకుపోతే గేట్లు పెట్టేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రాం వాల్ కొట్టుకుపోతే.. దాన్ని కూడా గుర్తించలేదు. జగన్ హయాంలో చేయని తప్పునకు నన్ను 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాను. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్టుకున్నాయో చూశాం. నీరుంటే ఎలాంటి సమస్యలూ రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యల్ని తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్ సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నాను. వ్యవసాయానికి, పరిశ్రమలకు నీరు ఇవ్వడంతో పాటూ ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యాన్ని సాధించినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకూ నీరిచ్చే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో

ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు బ్లూ ప్రింట్‌ను కూడా సిద్ధం చేస్తున్నాం' అని సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చేయని నేరానికి నన్ను గత పాలకులు.. 53 రోజులు పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నా. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశాం. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్‌సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నా. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లే. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పం. రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం అని చంద్రబాబు వివరించారు.

# పింఛను పెంపు!

ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

**42.7 లక్షల మందికి పింఛను..** 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బడ్జెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బడ్జెట్‌లో కేటాయింపులు చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

# ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అ÷-జ్గ÷ంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్లు సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలను కూడా ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.

# తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ల బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు ఆన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్ళెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరపున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.

# దక్షిణాదిపై జనసేన గురి: 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్'

రాజకీయాల్లో సరికొత్త మార్పు కోసం జనసేనాని పవన్ కల్యాణ్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు నేడు జనసేన శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు పిఠాపురం నియోజకవర్గానికే పరిమితమైన ఈ కార్యక్రమం, నేటి నుంచి విస్తృత రూపం దాల్చనుంది. కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్రలోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి భారీ స్థాయిలో సభ్యులను చేర్చుకోవడం ద్వారా కేడర్ బలాన్ని ప్రదర్శించాలని అధినేత పవన్ కల్యాణ్ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈసారి క్రియాశీలక సభ్యత్వ రుసుమును రూ. 500 నుండి రూ. 400కు తగ్గించి సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాన్ని జనసేన చేస్తోంది. కేవలం సభ్యత్వాలు తీసుకోవడమే కాకుండా, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ భారీ ఇన్సూరెన్స్ ప్యాకేజీని ప్రకటించింది. సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల రూపాయల ప్రమాద బీమాతో పాటు, ప్రమాదవశాత్తు శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ. 2 లక్షల రూపాయలు, గాయపడితే రూ. 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. వసూలైన సభ్యత్వ రుసుమును పూర్తిగా పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగించడం ద్వారా కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తోంది. పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణను పెంచేందుకు సభ్యత్వాన్ని ఈసారి మూడు విభిన్న వర్గాలుగా విభజించారు. ఉద్యమి, సాధక్, ప్రదాత అనే పేర్లతో కార్యకర్తల పనితీరు, నిబద్ధత ఆధారంగా ఈ వర్గీకరణ సాగనుంది. ఇప్పటికే గత రెండు విడతల్లో విజయవంతంగా 13 లక్షల మందికి పైగా సభ్యులను నమోదు చేసుకున్న జనసేన, ఈ మూడో విడత ద్వారా రికార్డు స్థాయి సంఖ్యను చేరుకోవాలని భావిస్తోంది. సిద్ధాంతాల ప్రచారం, గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతమే ధ్యేయంగా సాగుతున్న ఈ సభ్యత్వ డ్రైవ్‌ను పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

# కల్తీపాల బాధితులకు మంత్రి దుర్గేశ్ పరామర్శ

రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనపై ఏపీ ప్రభుత్వం వేగంగా స్పందించింది. బాధితులను కాపాడేందుకు 'ఫోబి ఫిజల్' అనే ప్రత్యేక ఔషధాన్ని అత్యవసరంగా తెప్పించింది. ఈ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురై కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి కందుల దుర్గేష్ నేడు పరామర్శించారు. బాధితుల కుటుంబసభ్యులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షించారు. పరామర్శ అనంతరం మంత్రి దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు.

# జూబ్లీహిల్స్ లో భారీ అగ్నిప్రమాదం..

నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగళగౌరి షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పుతున్నారు. మూడు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేస్తున్నారు. షాపింగ్ మాల్‌లో ఉన్న వస్త్రాలు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. షాపింగ్ మాల్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో షాపింగ్ మాల్‌లో నలుగురు వ్యక్తులు ఉండగా.. వారు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ అగ్ని ప్రమాదం కారణంగా జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 36 ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ప్రమాదంలో మొదటి నాలుగు అంతస్తులు పూర్తిగా దగ్ధమ్యయాయి. ఒక సిలిండర్ బ్లాస్ట్ కావడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మొదటి మూడు అంతస్తుల్లో ఉన్న వస్త్రాలు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఇంక ఎవరైనా చిక్కుకుని ఉంటారనే అనుమానంతో ముందుగా అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. దట్టమైన పొగలు రావడంతో లోపలికి వెళ్లేందుకు ఫైర్ సిబ్బంది కాస్త ఇబ్బంది పడ్డారు. పోలీసులతో పాటు హైడ్రా అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు

గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వరంగల్‌లో 3, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మాల్ ప్రాక్టీసు కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్టిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టా÷-గ్గ÷ట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బిటసజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబ). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

# మూడుముళ్ల బంధంతో ఒక్కటైన విరోష్

## పెళ్లి ఫొటోలను షేర్ చేసిన రష్మిక

విజయ్ దేవరకొండ, రష్మిక మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడు ముళ్లు వేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను రష్మిక అభిమానులతో పంచుకుంటూ 'హాయ్ మై లవ్స్.. నా భర్తను మీకు పరిచయం చేస్తున్నా మిస్టర్ విజయ్ దేవరకొండ ' అని పేర్కొన్నారు. ఇకపోతే పరిమిత సంఖ్యలోనే పెళ్లి వేడుకకు అతిథులు హాజరయ్యారు. ఇరు కుటుంబ సభ్యుల మధ్య వేడుక జరిగిందని సమాచారం. 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు.





# ఎత్తిపోతల పథకం వద్ద చోరీ



## కాపర్ వైరు, ఆయిలు ఎత్తుకెళ్లిన దుండగులు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 26:** బండి ఆత్మకూరు ఎత్తిపోతల నీటి పథకానికి సంబంధించి న ట్రాన్స్ఫార్మర్ వద్ద బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఆదర్శ పాఠశాలకు సమీపంలో ఉన్న ఎత్తిపోతల నీటి పథకానికి సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ లోని కాపర్ వైర్ ను ఆయిల్ ను తస్కరించుకొని వెళ్లారు. ట్రాన్స్ఫార్మర్ వద్ద ఉన్న ఫీజులను పెరికివేసి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్ఫర్ పైకి ఎక్కి ఉంటారని విద్యుత్ ట్రాన్స్కో అధికారులు భావిస్తున్నారు. 125 కెపాసిటీ గల ఈ ట్రాన్స్ఫారంలోని ఆయిల్ ను ముందుగా తొలగించారు. బ్యాటరీ మిషన్ల ద్వారా లోపల బోల్టాలను కోసివేసి కాపరు వైరుని కూడా దొంగిలించారు. ట్రాన్స్ఫారంలో 60 కేజీల కాపరు ఉంటుందని ఇది కేజీ 1500 నుండి 2000 రూపాయల దాకా ఉంటుందని తెలుస్తోంది. ఆయిల్ కూడా 235 లీటర్ల దాకా ఉంటుందని, ట్రాన్స్ఫారం వద్ద కొంత కింద పడవేసి మిగతా ఆయన్ని కూడా ఎత్తుకెళ్లారు. లీటర్ ఆయిల్ ధర 100 రూపాయలు దాకా ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గురువారం ఉదయం ఎత్తిపోతల నీటి పథకాన్ని ప్రారంభించేందుకు వర్కర్ అక్కడికి వెళ్ళగా విద్యుత్ సరఫరా జరగలేదు. దీంతో సంబంధికులకు వర్కర్ సమాచారం అందివ్వడంతో ట్రాన్స్కో అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలించిన మేరకు ట్రాన్స్ఫార్మర్ ఖాళీగా ఉండటంతో చోరీకి గురైందని గుర్తించారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే ఎస్సై జగన్మోహన్ పోలీస్ సిబ్బందితో ఇక్కడికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎత్తిపోతల నీటి పథకాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆ శాఖ కార్య నిర్వాహక ఇంజనీరు రామకృష్ణ గత వారం రోజుల క్రితమే నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పర మటూరు ఎత్తిపోతల పథకానికి బుధవారం సాయంత్రం టెక్నికల్ అసిస్టెంట్ సాంబశివుడు నోటీసు ఇచ్చి వెళ్లారు. మిగతా ప్రాంతాలలో కూడా ఎత్తిపోతలకు సంబంధించి నోటిసులు జారీ చేస్తూ ఉన్నారు. ఎత్తిపోతల నీటి పథకాల వద్ద చోరీలు జరుగుతూ ఉండటంతో ఆ శాఖకు చెందిన అధికారులు ముందుగానే మేల్కొని నోటీసులు జారీ చేస్తూ ఉండటం గమనార్హం. ఫిబ్రవరి నెల మొదటి వారంలో నంద్యాల మండలం పులిమద్ది వద్ద ఇదే తరహాలో చోరీ జరిగింది. రెండు రోజుల క్రితం కోవెలకుంట్ల మండలం, కలుగొట్ల గ్రామం వద్ద ఉన్న ఎత్తిపోతల పథకం వద్ద కూడా ఇదే మాదిరిలో చోరీ జరిగిందని ఆ శాఖ అధికారులు పేర్కొంటూ ఉన్నారు. అయితే జరిగిన సంఘటనలను పరిశీలిస్తే, ట్రాన్స్ఫార్మర్ల వద్ద కాపర్ వైర్లను ఎత్తుకెళ్ళడం ఒక వ్యక్తితో సాధ్యమయ్యే పని కాదని, బహుశా నలుగురు వ్యక్తులు కలిసి ఈ చోరీలకు పాల్పడుతూ ఉంటారని విద్యుత్ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చోరీ జరుగుతున్న సంఘటన గుర్తించి, ఇవి తమ మీదకు రాకుండా ఉండేందుకు ఎత్తిపోతల శాఖకు చెందిన అధికారులు నోటీసులు ఇచ్చి తెలివిగా తప్పుకుంటున్నారు. ఎలాంటి చోరీలు జరిగిన తమకు సంబంధం లేదంటూనే భవిష్యత్తులో తాము తీసుకునే నిర్ణయాలకు ఎత్తిపోతల నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులలో పేర్కొనడం కొసమెరుపు.



# మనంచేసే ప్రతికార్యం కర్మానుసారం జరుగుతుంది.



**మంత్రాలయం పిబ్రవరి26 (నంది దినపత్రిక ప్రతినిధి)** ఈరోజుల్లో తప్పు చేసేవాళ్ళు బాగానే ఉంటున్నారు. సత్కార్యాలు చేసేవారు ఇబ్బంది పడుతున్నారు. ఎందువల్ల ఇలా జరుగు తుంది? తాతా, చూస్తుంటే అధర్మ పరులే ఎక్కువ సుఖపడుతూన్నట్లు కనిపిస్తుంది, ఎందుకని అంటాడు ధర్మరాజు భీష్ముడితో. ఇది ఇప్పుడు మనవంటి వారందరికీ వచ్చే సందేహమే, ఇప్పటి నాయకులను, జరుగుతూన్న విషయాలు చూస్తున్నప్పుడు. భీష్ముడు అంటారు అది నీ భ్రమ. జన్మజన్మల నుంచి పేరుకున్న పుణ్యాన్ని ఇప్పుడు ఇలా అనుభవిస్తున్నారు వారు. ఇప్పుడు చేసేపాపపు పనులకు వారు ఫలితం తొందరలో అనుభవించక తప్పదు అని. ఎంతటి చక్కని సమాధానం.ధర్మ ఏవ మనః కృష్ణే స్వభావ ధర్మంగా ఉండడం నాస్వభావం మరి, ఏమి చేయమంటావంటారు ధర్మరాజు ద్రౌపదితో. ద్రౌపది ఎప్పుడూ ధర్మం ధర్మం అనే మీరు అడవులు పట్టుకు తిరుగుతున్నారు. అధర్మం చేస్తూన్న వారు రాజ్యాలు ఏలుతున్నారు అంటే ఏమి చేయమంటావు,నాస్వభావం అటువంటిదంటారు ధర్మరాజు. పుట్టుకతో వచ్చిన బుద్ధులు (స్వభావం) పుడకలతో కాని పోవని సామెత. మనిషి స్వభావం అంత తేలిగ్గా మారదు. మామూలుగావాడుతున్నారు కాని స్వభావం అనేది మంచి లక్షణం. ప్రభావం అంటే అలవాటు చేసుకునేది. అభావం అనేది చెడులక్షణం. ఈఅభావాన్ని సాధనతో, మంచి సత్సాంగత్యంతో ప్రభావంగా మార్చుకోవడానికి అవకాశముంది. పుణ్యఫలం, పాపఫలం రెండూ నశిస్తేనే ముక్తి. రెండూ విడివిడిగా అనుభవించాలి. పాపంలోంచి పుణ్యం, పుణ్యం లోంచి పాపం తీసేయడం కుదరదు జరుగదు. అందుకే పరమ దుర్మార్గుడు కూడా కొన్ని సుఖాలు పొందుతూ ఉంటాడు అప్పుడప్పుడు. మిగిలిన తనపూర్వజన్మ పుణ్యఫలం వల్ల.

# తెలుగు గంగ ప్రధాన కాలువకు గండి



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 26:** వెలుగోడు తెలుగు గంగ రిజర్వాయర్ కు సంబంధించిన ప్రధాన కాలువకు గండి పడింది. గురువారం తెల్లవారుజామున నాల్గవ బ్లాకు సమీపంలో 8.5 కిలోమీటర్ల వద్ద గాలి చెన్నయ్యపాలెం పోత చెరువుకు సంబంధించి వెళ్లే డిస్ట్రిబ్యూటరీ వద్ద తెలుగు గంగ కుడి కాలువకు గండి ఏర్పడింది. ఈ సమయంలో కాలువలో 2000 క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు ప్రవహిస్తూ ఉంది కాలువకు గండి ఏర్పడం వల్ల 15 అడుగులకు పైగా కుడి కాలువ కో తకు గురి అయింది. తెలుగు గంగ కాలవలోని నీరంతా పూత చెరువు లింగాపురం చెరువుల ద్వారా మద్దిలేరు వాగులోకి ప్రవహిస్తూ ఉంది. ఈ కారణంగా అలుగుల ద్వారా నీటి ప్రవాహం అధికం కావడంతో అన్నదాతలు ఎక్కడ తమ పంటలు నీటి మునగకు గురి అవుతాయని ఆందోళన చెందుతూ ఉన్నారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే తెలుగు గంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్ రెడ్డి డిప్యూటీ ఇంజనీర్ నవజీవన్ రెడ్డి అసిస్టెంట్ ఇంజనీర్లు రమేష్ నాయక్ నాగేంద్ర తదితరులు వెంటనే అప్రమత్తమయ్యారు తెలుగు గంగ కాల్వ వద్ద గేట్లను మూసి వేయించారు. కాల్వ వెంట ప్రయాణించి డిస్ట్రిబ్యూటర్లను ఎత్తి వేయించి కాలువలో నీటి సామర్థ్యం తగ్గేలా చర్యలు తీసుకున్నారు. గండి పడిన చోట యుద్ధప్రాతిక పదిన గంగా అధికారులు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

# నిర్లక్ష్యం వల్లే గంగ కాలువకు గండ్లు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 26:** తెలుగు గంగ అధికారుల అలసత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగానే తెలుగు గంగ ప్రధాన కాలువలకు గండ్లు పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకే నెలలో రెండుసార్లు ప్రధాన కాలువలకు గండ్లు పడటానికి ఏ విధంగా చూడాలి అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఫిబ్రవరి నెల ఆరవ తేదీన నాలుగో బ్లాకు వద్ద ఎడమ పక్కన ఉన్న కాలువకు పెద్ద ఎత్తున గడ్డి పడింది. అయితే ఇక్కడ అటవీ ప్రాంతంలో నుండి మద్దిలేరు వాగు ద్వారా నీరు ఎక్కువగా ప్రవహించి అండర్ టన్నెల్ ద్వారా నీరు ఎక్కువగా రావడంతో కాలువ పెద్ద ఎత్తున కో తకు గురైంది. ఈ గండిని పూడ్చుటానికి అధికారులకు నాలుగు రోజుల సమయం పట్టింది. తిరిగి గురువారం తెల్లవారుజామున గాలి చెన్నయ్యపాలెం గ్రామానికి సమీపంలో ఉన్న నాలుగవ బ్లాకు వద్ద నున్న 8.5 కిలోమీటర్ల వద్ద పెద్ద గండి పడింది. కాలువలో 2000 క్యూసెక్కుల ప్రవాహం ఉండటంతో కాలువ 20 అడుగులకు పైగా కోతకు గురైంది. గురువారం ఏర్పడిన గండి కూడా గతంలో పడిన గండికి సమీపంలోనే పడటం గమనార్హం. దీంతో తెలుగు గంగ శాఖకు చెందిన అధికారులు కాలువ గట్ల వెంట పరుగులు తీశారు. కాల్వ వెంట ఉన్న డిస్ట్రిబ్యూటర్లను తెరిపించి నీటిని కాలువలో తగ్గించే ప్రయత్నం చేశారు. కాల్వకు గండి పడేందుకు అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణమని రైతులు పేర్కొంటూ ఉన్నారు. కాలువలో నీరు ప్రవహించే సమయంలో అధికారులు ఏనాడు కూడా కాలువ గట్లను పరిశీలించిన పాపాన పోలేదని రైతులు పేర్కొంటున్నారు. అయితే గురువారం నాడు జరిగిన సంఘటనను కూడా మంతా తుఫానులో కలిపేందుకు అధికారులు ప్రయత్నాలు చేశారు. గత ఏడాది నవంబర్ నెలలో ఏర్పడిన మంతా తుఫాను కారణంగా కాలువ బలహీనమైపోయిందని గంగ అధికారి ఒకరు పేర్కొన్నారు. అదిగాక గండి పడిన ప్రాంతంలోఅండర్ టన్నెల్ ఉందని, దీనికి కాలువకు ఆనుకొని ఉన్న గోడ నీటిలో నానిపోయి గండి ఏర్పడేందుకు కారణమై ఉంటుందని పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వాల తప్పిదాల కారణంగానే తెలుగు గంగ ప్రధాన కాలువకు గండ్లు ఏర్పడుతున్నాయని గంగ ఛైర్మెన్ చెన్నా రెడ్డి గారి సంజీవ కుమార్ రెడ్డి ఆరోపిస్తున్నారు. కాలువకు గండి పడిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో తెలుగు గంగ కాలువ పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయలను కేటాయించిందని, దీనికి లైనింగ్, అవుట్ లెట్ ఛానల్, అండర్ టన్నెల్ దగ్గర పనులు చేయించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వహించాడని చైర్మన్ ఆరోపిస్తున్నారు. పనులు సక్రమంగా చేయకపోవడం వల్ల గండ్లు ఏర్పడుతున్నాయని, తమ అవినీతి పనులకు అడ్డు వస్తున్నారని నిజాయితీపరులైన అధికారులను గతంలో బదిలీ చేయించారని ఆరోపిస్తున్నారు. నాసిరకంగా పనులు చేయడం వల్లే కాలువ సామర్థ్యం సరిగా లేక గండ్లు పడుతున్నాయని, ప్రస్తుతం గండిపడిన చోట కాలువలో 2000 క్యూసెక్కుల నీరు ప్రవహించడం వల్ల రైతులకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదని, అదే కాలువలో 5 వేల క్యూసెక్కులకు మించి నీరు ఉండి ఉంటే రైతులు పెద్ద ఎత్తున ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొని ఉండేవని చైర్మన్ సంజీవరెడ్డి పేర్కొన్నారు.





# వడ్ల షేక్ హుస్సేన్ భాషా మృతి

## అపన్న హస్తం కింద 25000/- అందించిన కంపరాజు రాజేష్ గౌడ్.



**శిరివెళ్ల. (నంది పత్రిక);**-సిరివెళ్ల మండల పరిధిలోని నల్లమల అడవి సమీప గ్రామం అయినటువంటి మహదేవపురంలో వడ్ల షేక్ హుస్సేన్ భాష (40) అను వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలియజేశారు. గత రెండు సంవత్సరాల నుండి అనారోగ్యంతో జీవన్మరణ మరణ పోరాటం చేసి నేడు తుది శ్వాస వదిలినట్లు కుటుంబ సభ్యులు విల పించారు. నిరుపేద కుటుంబం చిన్న వయసులోనే మృతి చెందడం పోషించాల్సిన కుటుంబ యజమాని తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో దిక్కుతోచని స్థితిలో ఉండగా మహదేవపురం గ్రామానికి చెందిన యువ నాయకుడు కంప రాజు రాజేష్ గౌడ్ మానవతా దృక్పథంతో స్పందించారు.

**మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను రాజేష్ గౌడ్ ఓదార్చారు.**

అంతిమ సంస్కారానికి ఇతర ఖర్చులకు గాను కంపరాజు రాజేష్ గౌడ్ 25 వేల రూపాయలు అందజేసి పేదరికంతో జీవనం కొనసాగిస్తున్న సాటి కుటుంబ సభ్యులు మరియు మృతి చెందిన వడ్ల షేక్ హుస్సేన్ భాష పట్ల మానవతా దృక్పథంతో స్పందించారు. ఈ సందర్భంగా మహదేవపురం గ్రామస్తులు మరియు బాధిత కుటుంబ సభ్యులు కంపరాజు రాజేష్ గౌడ్ యొక్క మానవత్వానికి దాతృత్వానికి మంచితనానికి మారుపేరుగా నిలుస్తూ ఆపద సమయంలో అండగా నిలబడడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# జనసేన సభ్యత్వం - భవితకు భీమా సౌకర్యం.

## నేటి నుండి జనసేన ఉద్యమి తభ్యత్వం.

### - జనసేన శిరివెళ్ల మండల నేత పెసరాయి చాంద్ బాషా



**శిరివెళ్ల :-(నంది పత్రిక)** జనసేన పార్టీ ఆదేశాలు మరియు ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ నేత ఇరిగెల రాంపుల్లా రెడ్డి గారి పిలుపు మేరకు నేడు గురువారం నుండి జనసేన ఉద్యమి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు శిరివెళ్ల మండలం జనసేన పార్టీ నేత పెసరాయి చాంద్ బాషా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 1 వ వార్డులో మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల భవితకు భద్రంగా బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల అనేక బహుళ ప్రయోజనాలు లభిస్తాయని సభ్యులుగా చేరిన జనసైనికులు ప్రశ్నించే స్థాయి నుండి ప్రతినిధిగా తీర్చిదిద్దే శిక్షణ లభిస్తుందన్నారు. పార్టీ సభ్యత్వం వల్ల ప్రత్యేక గుర్తింపు గౌరవం ప్రాధాన్యత పార్టీ బాధ్యతలు నాయకత్వ బాధ్యతలు లభిస్తాయన్నారు పార్టీ సభ్యత్వం తీసుకుంటే నాయకత్వ లక్షణాలు తీర్చిదిద్దేందుకు శిక్షణ పార్టీ ఇస్తుందన్నారు సభ్యత్వం గల కుటుంబానికి ఐదు లక్షల ప్రమాద బీమా ఒక రక్షణ కవచంలా లభిస్తుందని పెసరాయి చాంద్ బాషా తెలియజేశారు

జనసేన సాధక్ లను సంప్రదించి జనసేన కుటుంబంలో చేరి సరికొత్త రాజకీయ వ్యవస్థలో భాగస్వాములు కావాలని చాంద్ బాషా పిలుపునిచ్చారు. సభ్యత్వం లేకుండా పార్టీలో ఎంత చురుకుగా పనిచేసిన ప్రేక్షకులుగానే మిగిలిపోతారని ఒక కుటుంబం ఒక నాయకత్వం బహుళ ప్రయోజనాలు ప్రమాద భీమా సౌకర్యాలు లభించాలంటే వెంటనే జనసేన ఉద్యమి సభ్యత్వం తీసుకోవాలని చాంద్ బాషా తెలియజేశారు. జనసేన ఉద్యమి సభ్యత్వం తీసుకోవడం రెన్యువల్ చేసుకోవడానికి మరిన్ని వివరాల కోసం 94410 55145 నంబర్ ని సంప్రదించాలని పెసరాయి చాంద్ బాషా స్పష్టం చేశారు.

# నేటి నుండి "జనసేన ఉద్యమి" సభ్యత్వ నమోదు ఉత్సవాలు



**సిరివెళ్ల (నంది పత్రిక)** పార్టీ సభ్యత్వం వల్ల ప్రత్యేక గుర్తింపు గౌరవం ప్రాధాన్యత పార్టీ బాధ్యతలు నాయకత్వ బాధ్యతలు లభిస్తాయి అని తేజ అన్నారు.

**జనసేన ఉద్యమి సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలు:**

పార్టీ సభ్యునిగా గుర్తింపు, గౌరవం

పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత

పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించేందుకు సభ్యత్వం తప్పనిసరి. సభ్యత్వం ఉన్న వారికి మాత్రమే నాయకత్వ బాధ్యతలు

నాయకత్వ ట్రైనింగ్, నాయకులుగా ఎదిగే అవకాశాలు

5 లక్షల ప్రమాద బీమా ద్వారా మీ కుటుంబానికి భరోసా

ఇప్పుడే మీ స్థానిక జనసేన సాధక్ ను సంప్రదించి జనసేన కుటుంబంలో చేరండి, సరికొత్త రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యులు కండి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకుడు తేజ పాల్గొన్నారు.

# కష్టపడి చదివితేనే ఫలితాలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 26:** చదువు విషయంలో కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం బండి ఆత్మకూరులోని కస్తూరిబా పాఠశాలను డీఈఓ జనార్దన్ రెడ్డి అకస్మికంగా సందర్శించారు. విద్యార్థినిలు ఎలాంటి ఒత్తిడిలకు గురికాకుండా పదవ తరగతి పరీక్షలు రాయాలని డీఈవో సూచించారు. అనంతరం విద్యార్థినీలతో కలిసి డీఈవో టిఫిన్ చేసి వెళ్లారు.



నంది పత్రిక
శుక్రవారం 27 - 02 -2026

# నీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వర్తించాలి



**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**లీకేజీలు గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి**

**ప్రతిరోజు తాగునీటి నాణ్యతలను తనిఖీ చేయాలి**

**కర్నూలు నంది పత్రిక....** తాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడానికి ఇంజినీరింగ్ విభాగ అధికారులు, సచివాలయ, తాగునీటి సరఫరా విభాగ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగ అధికారులతో పాటు జూమ్ ద్వారా అమినిటీస్ కార్యదర్శులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అతిసారం ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు ఉదయం అన్ని సచివాలయాల పరిధిలో అమినిటీస్ కార్యదర్శులు, తాగునీటి సరఫరా సిబ్బంది సంయుక్తంగా క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రపరచాలని, ఆర్‌సి రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. డ్రైనేజీ కాలువల్లో ఉన్న పైప్‌లైన్ల తొలగింపులో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. గృహాల వద్ద సైతం డ్రైనేజీ కాలువల్లో పైప్‌లైన్ లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుండి



ఫిర్యాదులు, పత్రికల్లో వార్తలు వచ్చేంత వరకు వేచి ఉండకుండా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజు ప్రజల్లో తిరిగితేనే సమస్యలు స్పష్టంగా తెలుసుకుంటామని, ఏఈలు, డిఈలు అమినిటీస్ కార్యదర్శులతో కలిసి ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. తాగునీటి కొళాయి చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని, నిధుల లభ్యతను బట్టి గుత్తేదారులకు బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, క్రిష్ణలత, శ్రీనివాసన్, సూపరింటెండెంట్ మంజూర్ బాష, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైష్ణవి, ఖాసీం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ కనక దుర్గమ్మ, ఏలూరు ద్వారక తిరుమల ఆలయాలను కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎంపీ నాగరాజు



**కర్నూలు నంది పత్రిక....** విజయవాడ కనక దుర్గమ్మ, ఏలూరు ద్వారక తిరుమల ఆలయాలను కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు..దర్శనార్థం ఆలయాలకు చేరుకున్న వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు... ముందుగా కనక దుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ ఆయన కుటుంబ సభ్యులు, అనంతరం ద్వారక తిరుమల ఆలయాన్ నిదర్శించుకుని వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు.. దర్శనాల అనంతరం వేదపండితులు, అర్చకులు వారికి వేదాశీర్వచనాలను అందించి, తీర్థ ప్రసాదాలను అందచేశారు...ఈ సందర్భంగా జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కనక దుర్గమ్మ అమ్మవారిని , వెంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు ఎంపీ నాగరాజు తెలిపారు...

# కుందునది వరద ముంపున పరివాహక గ్రామాలు

**జాతీయ రహదారి నిర్మాణానికి కుందునది కరకట్టను యదేచ్ఛగా తవ్వుతున్న రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్**







**బనగానపల్లె ఫిబ్రవరి 26 నంది పత్రిక** కుందునదికి వరద వస్తే పరివాహక గ్రామాలు భీమునిపాడు కంపమల్ల క్రిష్టిపాడు హరివరం పొట్టిపాడు గ్రామాలు మరియు రైతుల పంట పొలాలు జలదిగ్బంధంలో చిక్కుకునే పరిస్థితిలోకి నెట్టబడుతున్నాయి. రాయలసీమ ఎత్తిపోతల పథకం కింద గత ప్రభుత్వము కుందూ నది విస్తరణ పనులు చేపట్టింది ఈ పనులలో నదిని వెడల్పు చేసి నది నుండి తీసిన రాయిని మట్టిని కరకట్టలుగా ఇరువైపులా పోశారు. అయితే కొద్ది నెలల క్రితం మొదలైన జమ్మలమడుగు కల్వకుర్తి జాతీయ రహదారి విస్తరణ పనులలో ఈ కరకట్ట మట్టిని సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్ తవ్వుతూ రోడ్డు విస్తరణకు వాడుతున్నారు . నది కింది వరకు ఈ కరకట్ట మట్టిని తవ్వడంతో దిగువనున్న గ్రామాలు రైతుల పొలాలు నీటి ముంపునకు గురయ్యే ప్రమాదం అంచున నిలిచి ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులు మొదలైనప్పటి నుండి కోవెలకుంట్ల జోల ద్వారాసి వద్ద నదికి ఇరువైపులా పోసినటువంటి కరకట్టలను తవ్వి రోడ్డు విస్తరణలో వాడారు. అప్పుడు దీనిపై ప్రభుత్వం ఏ విధమైనటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్ అడ్డగోలుగా దోచి రోడ్డు విస్తరణకు వాడారు. ఇప్పుడు భీమునిపాడు గ్రామం దగ్గరగా పోసినటువంటి కరకట్టాలను కూడా టిప్పర్ల ద్వారా తొలి రోడ్డు విస్తరణకు వాడుతున్నారు దీంతో వర్షాకాలంలో కుందునది ఉగ్రరూపం దాలిస్తే ఈ గ్రామాలు ఏమౌతాయెనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వానాకాలంలో వరద వస్తే నదిలో మూడు టీఎంసీల దాక నీరు ప్రవహించిన సందర్భాలు ఉన్నాయి కుందూ నది విస్తరణలో ఈ గ్రామాలు ముంపునకు గురికాకుండా ఇరువైపులా కరకట్టలను పోయడం జరిగినది . అయితే ఇప్పుడు ఈ కరకట్టలను నది అడుగుభాగం వరకు త్రవ్వి ఖాళీ చేయడంతో వరద సమయంలో నీరంతా సమీప గ్రామాలను ముంచేత్తే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

**కరకట పనులను తవ్వడం నిలుపుదల చేయాలి**

కుందునది కరకట్టలను రోడ్డు విస్తరణకు వాడడం వల్ల వరద సమయంలో నది నీరంతా సమీప గ్రామాలను ముంచేత్తే అవకాశం ఉందని ప్రభుత్వము ఈ కరకట్టలను తవడాన్ని ఆపివేయాల్సిందిగా కాంట్రాక్టర్ను ఆదేశించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



## కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

**బనగానపల్లె జనసేన నాయకులకు ఎమ్మెల్సీ నాగబాబు సూచన**



**బనగానపల్లె ఫిబ్రవరి 26 నంది పత్రిక** ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు బనగానపల్లె జనసేన నాయకులకు సూచించారు. బనగానపల్లెకు చెందిన జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్సీ నాగబాబును విజయవాడలో ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో బనగానపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు భాస్కర్ మరియు గుర్రప్ప కొలిమిగుండ్ల మండలం నాయకులు పృథ్వీ అవుకు మండల నాయకులు అజిత్ రెడ్డి, జనార్ధన్ యాదవ్, సంజామల మండల నాయకులు రాజు, భాను, బనగానపల్లె నాయకులు హాజీవలి, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు ఈ సందర్భంగా నియోజకవర్గం పరిస్థితుల పై చర్చించి నంద్యాల జిల్లా పర్యటన చేయవలసిందిగా ఎమ్మెల్సీని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అందరికీ అవకాశాలు వస్తాయని పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లాలని గ్రామస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సమస్య పరిష్కారాల కృషిలో ఇబ్బందులు ఎదురైనప్పుడు స్థానికంగా ఉన్న శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను కూటమి పార్టీల నేతలతో కలిసి సమిష్టిగా తిప్పికొట్టి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారని పేర్కొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' సదస్సు



**రుద్రవరం ప్రతినిధి ఫిబ్రవరి 26 (నంది పత్రిక):** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సు విద్యార్థుల ఉత్సాహం మధ్య విజయవంతంగా ముగిసింది. ఉపాధ్యాయులు దివాకర్, హబీబాల పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జతగా ఉన్న పంజాబ్ రాష్ట్ర భాష, సంస్కృతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పంజాబీ మరియు తెలుగు భాషల మధ్య గల వైవిధ్యం, ఆయా రాష్ట్రాల సాంస్కృతిక సారూప్యతలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు మరియు స్కూల్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, దేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెబుతూ జాతీయ సమైక్యత భావనను పెంపొందిస్తాయని కొనియాడారు. 6 నుండి 9వ తరగతి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పంజాబీ భాషా పదాల గురించి అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థుల్లో జాతీయ ఐక్యత మరియు భాషా వైవిధ్యంపై అవగాహన మరింత పెరిగిందని పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది.

## "వైద్య వృత్తి పవిత్రమైనది ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి"



**బద్వేల్ ఫిబ్రవరి 26 (నంది పత్రిక)** వైద్య వృత్తి పవిత్రమైనదని, ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని వైద్యాధికారులు అన్నారు. బద్వేల్ పట్టణంలోని తొట్టిగారి పల్లెలో గురువారం వైద్య అధికారి జే. వినయ్ కుమార్ అభినందన సభ, తొట్టిగారి పల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటవీధి (యు పి హెచ్ సి) వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలు వినయ్ కుమార్ వైద్యాధికారిగా మండలంలో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. కరోనా సమయంలో కష్టపడి పని చేసి మంచి పేరు సంపాదించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో విష జ్వరాలను అదుపు చేసి, ప్రజలలో శుభ్రత, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారని చెప్పారు. సురేంద్రనగర్ (యు పి హెచ్ సి) వైద్యాధికారి శ్రీనివాసులు, గాంధీనగర్ (యు పి హెచ్ సి) వైద్యాధికారి శరత్ చంద్ర మాట్లాడుతూ, వైద్యాధికారి వినయ్ కుమార్ (పి హెచ్ సి)కి చేసిన సేవలను కొనియాడారు. ఉన్నత చదువులకు వెళ్లి భవిష్యత్తులో ప్రమోషన్లు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్య అధికా రులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి వెంగయ్య, సిహెచ్ఓ చంద్రావతి, (టి బి) సూపర్వైజర్ ప్రసాద్, సిహెచ్ ఓ మురళి, శంభు ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్ రావు, శ్రీరాములు, కాసిం తదితర వైద్య సిబ్బంది వినయ్ కుమార్ చేసిన సేవలను కొనియాడుతూ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



## అటవీ జంతువుల రక్షణ మన బాధ్యత

**పశువులకు తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి ఏడీఏ డాక్టర్ మనోరంజన్ ప్రతాప్**



**రుద్రవరం ప్రతినిధి ఫిబ్రవరి 26 (నంది పత్రిక):** నల్లమల అడవి ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు తమ పశువులకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి. మనోరంజన్ ప్రతాప్ సూచించారు. గురువారం అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా ఆదేశాల మేరకు, చలమ రేంజ్ ఆఫీసర్ ఉదయ దీప్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద కంబలూరు, శ్రీరంగాపురం గ్రామాలలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత సమాజానికి ఎంతో అవసరమని, అడవుల పెంపకం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించి మానవ ఆయుర్దాయం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లోని పశువులు మేత కోసం అటవీ ప్రాంతాలలో సంచరించడం వల్ల, వాటికి ఏవైనా వ్యాధులు ఉంటే అవి అడవి జంతువులకు కూడా సోకే ప్రమాదం ఉందని, అందుకే రైతులు తమ పశువులన్నింటికీ తగు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామారావుతో పాటు అటవీ మరియు పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## కర్నూల్ మద్దూర్ నగర్ నందు గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని మరియు అమ్మ వృద్ధుల శరణాలయాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి



**కర్నూలు నంది పత్రిక......** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం మద్దూర్ నగర్ నందు గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని మరియు అమ్మ వృద్ధుల శరణాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అక్కడి వారిని అడిగి వారికీ అందించే భోజన, వసతి, వైద్య సదుపాయలను గురించి తెలుసు కొని సంతృప్తి వక్తం చేసారు. వృద్ధులకు నిరాశ్రయులకు ఏవైనా సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేస్తే వారి చట్ట పరమైన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాది రాంపుల్లయ్య, వసతి గృహ నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొనారు.

# రాయలసీమ యూనివర్సిటీ ఖజానా కు కన్నం వేసిన రిజిస్ట్రార్ ను తొలగించాలి.







**యూనివర్సిటీ కి ప్రభుత్వం కేటాయించిన నిధులు సొంత ఖాతాలకు మళ్లింపు.**

**రిజిస్ట్రార్ బాధ్యతల నాటి నుండి నేటి వరకు నిధుల దుర్వినియోగంపై సమగ్రంగా విచారణ జరిపించాలి.**

**ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్ఎ,పిడిఎస్ యు, ఆర్ పిఎస్ఎఫ్ సంఘాల నాయకుల డిమాండ్.**

**వీసీ తీరుపై చెవిలో పూలు పెట్టుకొని నిరసన, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత.**

కర్నూలు నంది పత్రిక......రాయలసీమ యూనివర్సిటీ ఖజానాకు కన్నం వేసిన రిజిస్ట్రార్ ను తొలగించాలని ఏఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, ,పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు కె.రమణ, ఆర్ పిఎస్ఎఫ్ నాయకులు మౌలాలి డిమాండ్ చేశారు. గురువారం యూనివర్సిటీలోని అంబేద్కర్ విగ్రహం ముందు వీసీ ఇచ్చిన హామీలకు చెవులో పూలు పెట్టుకొని నిరసన తెలిపి, అనంతరం ఉన్నతాధికారులకు బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ అనేక అవినీతి,అక్రమాలకు నిలయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఇచ్చే నిధులు దుర్వినియోగానికి పాల్పడుతూ, సొంత ఖాతాల్లోకి నిధులు మళ్లించుకుంటూ, విద్యార్థులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడు లేని విధంగా పరీక్షల విభాగాలకు వచ్చిన నిధులను ఉద్యోగులకు చెల్లిస్తున్నారని, యూనివర్సిటీ కి ప్రధాన అకౌంట్లో ఉన్న ఖజానాను ఖాళీ చేసి, అప్పుల ఊబిల్లోకి నెట్టి, యూనివర్సిటీ పరిధిలో ఉండే ఫీజులను పెంచి, విద్యార్థులపై అదనపు భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ల విషయంలో రిజిస్ట్రార్ ఏకచక్రాధిపత్యం చలాయిస్తూ, ముడుపులు ముట్టజెప్పితే, అనుకూలంగా ఉన్న వారికే కాంట్రాక్టులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. నామమాత్రపు కమిటీలను నియమించి, కమిటీ సభ్యులుగా ఉన్నవాళ్లు అనుకూలంగా వ్యవహరించాలని ఒత్తిడి చేయడం జరుగుతుందని అన్నారు. రిజిస్ట్రార్ వ్యవహారంపై వీసీకి ఫిర్యాదు చేసిన కేవలం మాటలు చెప్పి, సాగనంపుతున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై స్పందిస్తూ కాన్వకేషన్ నిర్వహణ కోసమే కొనసాగిస్తున్నామని, అనంతరమే నూతన రీస్టార్ ను నియమిస్తామని హామీ ఇచ్చి, రిజిస్ట్రార్ నేటికీ కొనసాగింపు వెనక ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. రిజిస్ట్రార్ బాధ్యతల నాటి నుంచి అనేక అవినీతి, అక్రమాలకు తెర లేపారని అసహనం వ్యక్తం చేశారు. కావున ఇప్పటికైనా వీసీ మరియు ఉన్నతాధికారులు స్పందించి, రిజిస్ట్రార్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వర్సిటీ బందుకు పిలుపునిచ్చి,తరగతులను బహిష్కరించి, పెద్ద ఎత్తున నిరసన చేపడుతామని వారు హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ ఏఐఎస్ఎ,పిడిఎస్ యు, ఆర్ పిఎస్ఎఫ్ సంఘాల నాయకుల వంశీ,అమర్, శివ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వి బి జి రామ్ జి పథకంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 26, నంది పత్రిక విబి–జి రామ్ జి (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ & ఆజీవికా మిషన్(గ్రామీణ్) పథకంపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ఆరు వారాల పాటు “విబి–జి రామ్ జి జన్–సంవాద్” కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల ఉపాధి హామీ, పారదర్శక చెల్లింపు విధానం, శ్రామికుల హక్కుల పరిరక్షణ, తదితర అంశాలపై 2026 ఫిబ్రవరి 25 నుండి మార్చి 30 వరకు ఆరు వారాలపాటు విస్తృత ప్రచారం చేపడతామని ఆమె పేర్కొన్నారు. గ్రామస్థాయి వరకు అవగాహన పెంపు కోసం మీడియా ప్రచారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, గ్రామ సభలు, పాఠశాల కార్యక్రమాలు, పంచాయతీ రాజ్ ప్రతినిధులతో సమావేశాలు, శ్రామికుల సన్మానాలు వంటి కార్యక్రమాలు వారం వారీగా నిర్వహించబడతాయని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, భారత ప్రభుత్వం స్థానంలో పథకాన్ని అమలు చేస్తూ గ్రామీణ కుటుంబాలకు సంవత్సరానికి 100125 రోజుల ఉపాధి, 60:40 కేంద్ర–రాష్ట్ర వ్యయ భాగస్వామ్యం, వ్యవసాయ పీక్ సీజన్‌లో 60 రోజుల విరామం, పారదర్శక పాలన, దీర్ఘకాలిక గ్రామీణ ఆస్తుల సృష్టి వంటి ప్రయోజనాలను అందిస్తున్నదన్నారు. పథకం కింద జల సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులు, స్కిల్ సెంటర్లు, మార్కెట్లు, పశుసంపద మరియు మత్స్య మౌలిక సదుపాయాలు, తుఫాను–వరద నియంత్రణ నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ రాజ్ సంస్థలు, గ్రామ స్థాయి సంఘాలు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పథకాన్ని ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల సమన్వయానికి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.సి.హెచ్ అప్పారావుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జిల్లాలో వీఆర్వో, వీఆర్ఏల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలలో పరీక్షలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలి.

**జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 26 నందిపత్రిక భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వీఆర్వో, వీఆర్ఏల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వీఆర్వో, వీఆర్ఏలకు పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. ఉద్యోగుల ఆరోగ్యం బాగుంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చు అన్నారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, రక్తపరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు వైద్య చికిత్సలు కూడా అందించడం జరుగుతుందన్నారు. కావున రెవెన్యూ ఉద్యోగులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య పరీక్షలను స్వయంగా పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ వెంట డిఆర్ఓ ఎం.శివన్నారాయణ రెడ్డి, ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.




# అన్న క్యాంటీన్‌పై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మిక తనిఖీ







**నాణ్యత, పరిశుభ్రతలో రాజీ లేదు**

**కలెక్టర్ హెచ్చరిక**

**ఫిర్యాదులు అందితే సంబంధిత నిర్వాహకులపై చర్యలు ఉంటాయి**

**పేద, మధ్యతరగతి వర్గాల ఆకలిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది**

**నిర్వహణలో లోపాలు ఉంటే సహించేది లేదు**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 26, నంది పత్రిక

భీమవరం పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలోని బుధవారం మార్కెట్ వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి వర్గాల ఆకలిని తీర్చేందుకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లలో నాణ్యత, పరిశుభ్రత, సేవల ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ క్యాంటీన్‌లోని వాష్ ఏరియా, సర్వింగ్ ఏరియా, త్రాగునీటి సదుపాయాలు, భోజనం పంపిణీ విధానం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. వంటగది మరియు భోజన ప్రదేశాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, పారిశుధ్యంపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. భోజనం వడ్డించే సిబ్బంది తప్పనిసరిగా గ్లౌజులు, హెడ్ క్యాప్లు ధరించాలని సూచించారు. క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న లబ్ధిదారులతో కలసి భోజనం చేసి, ఆహార నాణ్యత, రుచి, పరిమాణం మరియు సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి లోపాలు గమనించినా సహించబోమని నిర్వాహకులను హెచ్చరించారు. చేతులు కడుక్కోవడానికి తగిన సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, త్రాగునీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్న క్యాంటీన్ పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తమైన సంక్షేమ కార్యక్రమమని, ప్రజలకు సకాలంలో నాణ్యమైన భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదులు అందిన పక్షంలో సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి శ్రీ వై. దోసి రెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను, ఈకేవైసీ పూర్తి చేయడంలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవ్...

**ఫిబ్రవరి 28 లోపుగా శతశాతం పూర్తి చేయాల్సిందే**

**పనుల నిమిత్తం ఉదయమే బయటికి వెళ్లే కుటుంబాలలో సర్వేను ఉదయం 7:30 గంటలకే ప్రారంభించాలి, అలాగే రాత్రి 6.00 సర్వే నిర్వహించి పూర్తి చేయాలి**

**పని స్వభావాన్ని బట్టి సమయంతో నిమిత్తం లేకుండా పనిచేయాల్సిందే**

**సర్వేలకు కూడా జిల్లా కలెక్టర్ వచ్చి సమీక్ష చాలా, మీ పని మీరు చేయరా అని సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం ఉండి/పాలకోడేరు: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 26, నంది పత్రిక ఉండి, పాలకోడేరు ఎంపీడీవో కార్యాలయాలను గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అకస్మికంగా సందర్శించి యుఎఫ్ఎస్ సర్వే, ఈకేవైసీ, టాక్స్ కలెక్షన్, అక్రమ లేఔట్ ల, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మీరు చేయవలసిన పనిపై కూడా జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి సమీక్షించడం అంటే మీరు ఎంత బాధ్యతగా పనిచేస్తున్నారో ఆలోచించాలన్నారు. పనిలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉండి, పాలకోడేరు మండలాల్లో యుఎఫ్ఎస్ సర్వే మందకోడిగా సాగడంపై తీవ్రస్థాయిలో సిబ్బందిపై ఆగ్రహించారు. ఉద్యోగం కాలక్షేపంకాదని, లక్ష్యాల మేరకు పని చేయాల్సిందే అని, అలాకాకుండా పనిచేయడానికి సాకులు చెప్తే ఉపేక్షించేది లేదన్నారు. మధ్య, పేద తరగతి వర్గాల ప్రజలు ఉదయమే వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్తారని వారు ఉన్న సమయంలోనే సర్వేను పూర్తి చేయాలన్నారు. ఉదయం 7:30కే క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని, మధ్యాహ్నం అందుబాటులోలేని కుటుంబాల సర్వేకు సాయంత్రం కూడా ఇంటింటికి వెళ్లి పూర్తి చేయాలన్నారు. కొన్ని ప్రభుత్వ పనులకు సమయంతో నిమిత్తం లేకుండా పనిచేసి లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. ఏ ఒక్కరు అధికారుల మాటను పేదాచెవిన పెట్టిన తీసుకునే చర్యలకు కట్టుబడి ఉండాలన్నారు. ఈఎఫ్ఎస్ సర్వేతో పాటు సమాంతరంగా ఈకేవైసీను కూడా పూర్తి చేయాలన్నారు. అలాగే టాక్స్ వసూళ్లను విధిగా చేయాలని, చెల్లించిన వారికి నోటీసులు జారీ చేసి, అనంతరం నిబంధనల మేరకు అటాచ్మెంట్ కు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ లేఔట్లను ముందస్తుగా గుర్తించి నిరోధించాలని, అక్రమ లేఔట్ లో ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి ఇవ్వడంపై ప్రతి కుటుంబంలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సెక్రటరీల అందరితోపాటు వీఆర్వోలు, సర్వేయర్లు కూడా యుఎఫ్ఎస్ పాల్గొని ఫిబ్రవరి 28 నాటికి నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వై.దోసి రెడ్డి, ఉండి, పాలకోడేరు ఎంపీడీవోలు ఎన్ వి ఎస్ ఎస్ శ్రీనివాస్, వీరమల్లు రెడ్డియ్య, తహసిల్దార్ లు కె.నాగార్జున, ఎం వి ఎస్ ఎస్ లక్ష్మి, ఈవోపీఆర్డి ఎంపీఎస్ రాంప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ఏ.కోదండరామయ్య, ఎస్ డబ్ల్యూ ఎస్ జి సెక్రటరీలు, వీఆర్వోలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.







## యువజన సంఘం ఆధ్వర్యంలో గోర్లగుట్ట లో పూజా కార్యక్రమాలు.

బేతంచెర్ల ఫిబ్రవరి 27 ( నంది పత్రిక ). బేతంచెర్ల మండలం గోర్ల గుట్ట గ్రామంలో రెండవ రోజు పద్మ నాభ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, శ్రీ పెద్దమ్మ దేవతా పూజ, నవగ్రహ పూజ, ప్రధాన కళశ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం గణపతి హోమం, మన్యు సూక్తి హోమం, సుదర్శన హోమం, పూర్ణాహుతి హోమం, బలి హరణం మొదలగు పూజ కార్యక్రమాలు గురువారం నిర్వహించడం జరిగాయి. గ్రామ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజలు కూడా భక్తి శ్రద్దలతో పెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించు కున్నారు.ఈ పూజా కార్యక్రమాలను గోర్లగుట్ట గ్రామ యువజన సంఘం కమిటి సభ్యులు మునగాల అమర్ నాథ్ రెడ్డి,ఎ.నాగార్జున, బి.చంద్,ఎ.విక్రమ్,కె. నాగేంద్ర కుమార్ రెడ్డి,బి.రామి రెడ్డి,బి.చంద్ర శేఖర్ రెడ్డి,ఎ.చంద్ర శేఖర్,వి.మధు,బి.నాయుడు వీరందరూ భాద్యతా యుతంగా, సుమారు 3 లక్షల రూపాయలు సమీకరించి, దిగ్విజయంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ప్రజలచే మెప్పు పొందారు. గంగినేని సుభద్రా దేవి, విఆర్ఎ ల సంఘం జిల్లా అధ్యక్షులు నందిపల్లె నాగేష్ తదితరులు పాల్గొన్నారు



# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేయడానికి ఉపయుక్తంగా ఉండే యుఎఫ్ సర్వే పూర్తి చేయడం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**భీమవరం పట్టణంలో యుఎఫ్ సర్వే పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం**

**ఒకరు విధులు గురించి మరొకరు గుర్తు చేయాల్సిన అవసరం లేదు..**

**మనమందరం ప్రజలకు మేలైన సర్వీస్ లు అందించడానికి నియమించబడ్డాం అని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి**

**రానున్న రెండు రోజుల్లో నూరు శాతం ఈఎఫ్ సర్వే, ఈకేవైసీ పూర్తి కాకపోతే చర్యలకు బద్ధులు కావాల్సి ఉంటుంది**

**మీ విభాగ అధిపతి ఆదేశాలను తప్పకుండా పాటించాల్సిందేనని హెచ్చరిక**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 26, నంది పత్రిక** భీమవరం మున్సిపల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆకస్మికంగా సందర్శించి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై వార్డుల వారీగా సంబంధిత సెక్రటరీతో ఆరా తీశారు. ఎందుకు సర్వే పూర్తి కావడం లేదని నిలదీశారు. ప్రజలకు సేవ చేసే స్థానంలో మనం ఉన్నామని సమయంతో నిమిత్తం లేకుండా పనిచేస్తే వ్యక్తిగత గుర్తింపుతో పాటు, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న రెండు రోజుల్లో నూరు శాతం సర్వే, ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో తడి చెత్త, పొడి చెత్త ఏర్పాటు జరగడం లేదని, మీ వంతు బాధ్యతగా ఇంటింటికి వెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు తడి చెత్త సేకరించడం జరుగుతుందని, పొడి చెత్త రెండు, మూడు రోజులకు ఒకసారి సేకరించడం జరుగుతుందని తెలియజేయాలన్నారు. ఇప్పటికే సరైన డంపింగ్ ప్రదేశం లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, తడి, పొడి చెత్తలను కలిపి ఇవ్వడం ద్వారా వేరు చేయడం సాధ్యం కాకపోవడంతో పాటు వాతావరణం కలుషితమై పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. చెత్త నిర్మూలన అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకున్న యధా స్థానంలో వాహనాలను నిలుపుదల చేయడం తగదని హెచ్చరించారు. షాపుల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, వారి షాపు ముందు పార్కింగ్ వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో భీమవరం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి మరియు ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ ఏ.రాంబాబు, మేనేజర్, స్వర్ణ వార్డు సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు



# ఈనెల 28వ తేదీన రామకృష్ణ మిషన్ ద్వారా మత్స్యకారులకు బోట్లు వలలు పంపిణీ:

**జిల్లా జాయింట్ కలెక్టర్ కె రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 26 నంది పత్రిక** నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామంలో ఫిబ్రవరి 28వ తేదీ శనివారం రామకృష్ణ మిషన్ ద్వారా మత్స్యకారులకు బోట్ల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ 28వ తేదీన రామకృష్ణ మిషన్ ద్వారా మత్స్యకారులకు 100 బోట్లు, వలలు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు జరిగిందని ఈ పంపిణీ కార్యక్రమం సందర్భంగా నిర్వహించే సమావేశంలో స్టేజ్ ఏర్పాటు, త్రాగునీరు, వసతి, విద్యుత్ సరఫరా, భోజనం ఏర్పాట్లు, భద్రత, పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

**నరసాపురంలో పుష్కర్ ఘాట్ ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్** జాయింట్ కలెక్టర్ నర్సాపురం బస్టాండు, రైల్వే స్టేషన్ నుండి భక్తులు పుష్కర ఘాట్లకు వెళ్లే రోడ్లను, వలందర రేవు పుష్కరఘాట్ ను పరిశీలించారు. రానున్న పుష్కరాలు సందర్భంగా రోడ్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధికిగాను తీసుకునే చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**సరిపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్** జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం మధ్యాహ్నం సరిపల్లె గ్రామ సచివాలయం సందర్శించి పట్టాదార్ పాస్ పుస్తకాల వెరిఫికేషన్ ప్రక్రియపై రికార్డులను పరిశీలించారు. గ్రామంలో 948 ఖాతాలు ఉన్నాయని, 408 ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందని, ఇంకను 540 పెండింగ్ లో ఉన్నాయని జాయింట్ కలెక్టర్ కు సిబ్బంది తెలియజేశారు. రైతులతో ఫోన్లో మాట్లాడి వారిచేత దరఖాస్తులు పెట్టించి సత్వరమే పెండింగ్ లో ఉన్న కేసులు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంలో ఆర్డిఓ దాసిరాజు, తహసిల్దార్ ఐ.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎల్.ఎల్.ఎన్ రాజు, నరసాపురం రూరల్ సిఐ దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నంద్యాలలో 28న ప్రత్యేక ఉపాధి మేళా

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 26 ( నంది పత్రిక ).** నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇండస్ట్రీ స్పాన్సర్డ్ ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రాం తో పాటు సర్టిఫికేషన్, ప్లేస్మెంట్ సపోర్ట్ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పరిశ్రమల సహకారంతో నిర్వహించబడే ప్రత్యేక ఉపాధి మేళా అని, ఫ్రెషర్స్‌కు 100 శాతం ఉచిత శిక్షణ తో పాటు ప్లేస్మెంట్ సపోర్ట్, ట్రైనింగ్ సమయంలో రూ. 5వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ట్రెయినీ మైక్రోబయాలజిస్ట్, క్వాలిటీ కంట్రోల్ (30 పోస్టులు) ట్రెయినీ ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్ స్టెరైల్ ఫార్ములేషన్స్ (30 పోస్టులు), ట్రెయినీ కెమిస్ట్ ప్రొడక్షన్ (ఫార్మా, కాస్మెటిక్స్, బయాలజికల్స్), ఇూ× / ఎక్సిపియెంట్ తయారీ (30 పోస్టులు), ప్రొడక్షన్ ఎక్విప్మెంట్ ఆపరేటర్ (30 పోస్టులు) ఉన్నట్లు తెలిపారు. ప్రముఖ సంస్థలు, అరబిందో, సిప్లా, హెటేరో, బయోలాజికల్ ఈ లిమిటెడ్, డా. రెడ్డీస్ లాబ్స్ వంటి మల్టీనేషనల్ కంపెనీలలో ఇంటర్మీడియట్ (బైపిసి, ఎంపీసీ), బీఎస్సీ లేదా ఎమ్మెస్సీలో మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, డి ఫార్మసీ, ఎం ఫార్మసీ, బి ఫార్మసీ, మెకానికల్, మెకాట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ డిప్లొమా, బీఈ లేదా బీటెక్ (కెమికల్ ఇంజినీరింగ్), ఇతర లైఫ్ సైన్స్ గ్రాడ్యుయేట్లు అయి ఉండాలని, 20232025 మధ్య ఉత్తీర్ణులు మాత్రమే అర్హులు అన్నారు. ఇంటర్వ్యూకు ఆంజనేయ సమయంలో అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించి రెండు జతల సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ , రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9492099091ను సంప్రదించాలని ఆయన కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డితో పాటు, డీన్ ఆఫ్ అకడమిక్స్ ప్రగతి రెడ్డి, ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ యువిఎస్ కుమార్, కెఎస్ కుమార్ పాల్గొన్నారు.



# మార్చి నెల పెన్షన్లు ఒక రోజు ముందుగా ఫిబ్రవరి, 28నే పంపిణీ

**- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**



**ఏలూరు, చీఫ్ బ్యూరో ఫిబ్రవరి, 26: నంది పత్రిక** మార్చి, 1వ తేదీ ఆదివారం వచ్చిన కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చీ= భరోసాపింఛన్లు ఒకరోజు ముందుగానే ఈనెల 28 వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈనెల 28వ తేదీ ఉదయం 7 గంటల నుండి పంపిణీ చేయడం జరుగుతుందని, ఏలూరు జిల్లా లో మార్చి,2026 నెలలో 2,57,658 మంది ఫించన్ దారులకు 113.09 కోట్ల రూపాయిలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా లో ఫించన్ లు పంపిణీ 28 వ తేదీన 100 శాతం పంపిణీ చేయుటకు చర్యలు తీసుకొనటం జరిగిందని, అనివార్య కారణం ల చేత 28వ తేదీన తీసుకోని వారికి 2 వ తేదీ న పంపిణీ చేయబడుతుందన్నారు. జిల్లా లో 5047 మంది సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బంది తో ఫించనల పంపిణీకి ఏర్పాట్లు చేయడమైనదని, సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం 7.00 గంటల నుండి పించనులు పంపిణి జరిగే విధముగా చర్యలు తీసుకోనవలసినదిగా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. పింఛను పొందేందుకు పింఛను దారులు వారి సంబంధిత ఇళ్లలో అందుబాటులో ఉండేలా గ్రామ, వార్డ్ సచివాలయ సిబ్బంది తో ముందస్తు సమాచారం అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వీ అధికారులను ఆదేశించారు.

# హత్య కేసులో నలుగురు ముద్దాయిల అరెస్టు...



**కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్.**

**కర్నూలు నంది పత్రిక...**

సీఆర్ 10/2026 ఖ/ం 103 (1), 118 (1), 351 (2) కర్నూల్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ **పిర్యాది:-** అమరచింతల మారుతి, వయస్సు 29 సం., తండ్రి పేరు కర్రెన్న, ఖండెరీ వీధి, కర్నూలు. **మృతుడు:-** అమరచింతల మనోహర్, వయస్సు 40 సం., తండ్రి పేరు కర్రెన్న, ఖండెరీ వీధి, కర్నూలు టౌన్.

**ముద్దాయిలు:-** 1. తెలుగు నగేష్, వయస్సు 24 సం., తండ్రి పేరు తెలుగు ఈరన్న, ఇంటి నెంబర్ 19/281, బండిమెట్ట, ఓల్డ్ టౌన్, కర్నూల్ టౌన్ 2. తెలుగు రాజు, వయస్సు 36 సం,.లు, తండ్రి పేరు సంజన్న, ఇంటి నెంబర్ 19/281/8, బండిమెట్ట, ఓల్డ్ టౌన్, కర్నూల్ టౌన్ 3. ఎరుకలి రాముడు ఏ మూగేన్న, వయస్సు 46 సం., తండ్రి పేరు ఎరుకలి తిక్కన్న, ఇంటి నెంబర్ 57-28ూ1, ఖండెరీ వీధి, కర్నూల్ టౌన్ 4. తెలుగు ఈరన్న, వయస్సు 47 సం., తండ్రి పేరు తెలుగు పెద్ద సంజన్న, ఇంటి నెంబర్ 19/281, బండిమెట్ట, ఓల్డ్ టౌన్, కర్నూల్ టౌన్ 22.02.2026 వ తేదీన రాత్రి సుమారు 10:00 గంటలకు పాత బస్ స్టాండ్ లోని అనిల్ బార్ దగ్గర పిర్యాది మారుతి పిర్యాది బాబాయి విజయ్ మరియు ముద్దాయిలు మద్యం త్రాగి ఉండి, పిర్యాది బాబాయి విజయ్ ని మద్యం తీసుకొని రమ్మంటే మాట వినలేదని గొడవ పడినారు. ఆ విషయం లోకసి పెంచుకొని ముద్దాయిలు నలుగురు ఖండెరి లోని ఐటిఐకాలేజీ దగ్గరకి ఆటోలో వెళ్ళి పిర్యాది తో మరియు పిర్యాది బాబాయి విజయ్ తో గొడవ పడి కత్తులు, కర్రలతో దాడి చేస్తుండగా, ఆ విషయం తెలుసుకున్న మృతుడు అమరచింతల మనోహర్ అక్కడికి వెళ్ళగా, ముద్దాయిలు అతనిని కొట్టి, ఎడమ వైపు మెడ పైన కత్తి తో పొడవగా మనోహర్ అక్కడి కింద పడిపోయినాడు. బంధువులు చికిత్స నిమిత్తం జిజిహెచ్ తీసుకొని వెళ్ళగా, అక్కడ డాక్టర్లు చూసి అప్పటికే చనిపోయినాడని చెప్పినారు. పిర్యాదుకి గాయాలు అయినవి.



కేసు దర్యాపులో బాగముగా 25.02.2026 సాయంత్రం 6:40 గంటలకు విచారణ అధికారి జే.బాబు ప్రసాద్, ఙూ, కర్నూలు టౌన్ , కర్నూలు ఒకటవ పట్టణ పోలీసు జ× , ా× చంద్ర, ా× ఖాన్ మరియు సిబ్బంది జోహారపురం కరెంట్ సబ్ స్టేషన్ కు దగ్గరలో, ముద్దాయిలను అరెస్ట్ చేసి వారిన వద్ద నుండి హత్య నేరానికి ఉపయోగించిన 1. ఒక ఆటో, 2. రక్తపు మరకలు కలిగిన రెండు కత్తులు, 3. నకులు (పంచ్) ను సీజ్ చేయడమైనది. అరెస్ట్ తర్వాత ముద్దాయిలను కోర్టు ముందు హాజరు పర్చడమైనది.

# వధూవరులను ఆశీర్వదించిన ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి



**నంది పత్రిక -డోన్** కర్నూలు నగరంలోని జి ఆర్ సి ఫంక్షన్ హాల్ గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ గౌడ్ కుమార్తె వివాహ మహోత్సవంనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి హాజరయ్యారు. కళ్యాణ మంటపానికి చేరుకున్న ఆయనకు రాజశేఖర్ గౌడ్ మరియు వారి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మన్నె సుబ్బారెడ్డి నూతన వధూవరులను కలిసి, అక్షింతలు వేసి నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.

# టెక్కెలో వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



**ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు**

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 26 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణ సమీపంలోని టెక్కెలో వెలసిన శ్రీ నాగులకట్ట గౌరి సమేత స్పటిక లింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నూతన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు నూతనంగా ప్రతిష్ఠించిన నవగ్రహాలకు మరియు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ భక్తిభావం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, లోక కల్యాణార్థం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13 వార్డ్ టీడీపీ ఇంచార్జి మధు సాయి , గోవింద్ నాయుడు, స్వామి నాయక్ మరియు ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు





# విజయ్ దేవరకొండ-రష్మికలపై శుభాకాంక్షల వర్షం

టాలీవుడ్ స్టార్ కపుల్, ప్రేమ పక్షులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటయ్యారు. తమ సంప్రదాయ పెళ్లి వేడుకకు సంబంధించిన అందమైన ఫోటోలను ఈ జంట సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నవ దంపతులకు పలువురు సినీ పరిశ్రమ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. వీరి అభినందనలతో సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. రష్మికతో కలిసి 'కాక్‌టెయిల్ 2' సినిమాలో నటిస్తున్న హీరోయిన్ కృతి సనన్, ఈ కొత్త జంటకు ప్రత్యేకంగా, ఎమోషనల్‌గా శుభాకాంక్షలు తెలిపారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పెళ్లి ఫోటోను పంచుకుంటూ, "ఈ ఫ్రేమ్‌లో ఎంత ప్రేమ, ఆనందం నిండిపోయిందో.

# సంఘ్ కార్యాలయం -ప్రేరణ కేంద్రంగా, సమాచారం నిలయంగా, సంపర్క సూత్రంగా వెలు గొందాలి.







**నంద్యాల జిల్లా, ఆరు దశాబ్దాల పైగా స్వయం సేవకుల ఆకాంక్షల సాకారంగా నూతన జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం హర్సోల్లాసాల మధ్య శాస్త్రోక్తంగా జరిగింది.**

**ముందు రోజు శాంతి హోమం నేడు గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం తో శాస్త్ర బద్ధంగా జరిగింది.**

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 26 ( నంది పత్రిక )** విభాగ్ సంఘ్ చాలక్ శ్రీ నీలకంతేశ్వరయ్య గారి అధ్యక్షతన సమావేశమైన సభలో విద్యా భారతి క్షేత్ర కార్యకారిణి సదస్యులు డాక్టర్ గడ్డం రామకృష్ణారెడ్డి, ప్రముఖ నిర్మాణ సంస్థ పీ వీ గ్రూప్ వ్యవస్థాపకులు, ప్రస్తుత మన కార్యాలయ నిర్మాత శ్రీ పబ్బతి వేణు గోపాల్, ప్రధాన వక్త ప్రాంత ప్రచారక్ శ్రీ విజయ ఆదిత్య జీ, జిల్లా సంఘ్ చాలక్ శ్రీ చిలుకూరి శ్రీనివాస్ వేదిక నలంకరించారు. భవన నిర్మాణంలో విశేషంగా కృషి చేసిన వారిని లాంచనంగా సత్కరించిన తదుపరి వక్త సందేశంలో మాధవ నిలయం, వివేకానంద సేవా సమితి సంయుక్త కార్యాలయాలు ఎంతో బాధ్యతాయుతంగా తమ సమాజ సేవా కార్యక్రమాలలో పునరంకిత మవ్వాలని పిలుపు నిచ్చారు.కార్యాలయం సమాజానికి ప్రేరణ దాయకంగా, కార్యాలయ సందర్శకులకు స్ఫూర్తినివ్వాలని తెలిపారు జిల్లాలోని అన్ని గ్రామాల్లోని సంఘ్ శాఖల, స్వయం సేవకుల పూర్తి సమాచారం కలిగిన సమాచారం కేంద్రంగా, నూతన సాంకేతికతను అంది పుచ్చుకుని, సదరు సమాచారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి, సమయాను కూలంగా వినియోగించుకుని సంఘకార్య సార్వ జనీనతకు కృషిచేయాలి.

**కార్యాలయం " సంపర్క సూత్రం"** కార్యాలయం సందర్శించిన వారికి స్ఫూర్తి నివ్వడమే కాకుండా, వారి సమాచారాన్ని ప్రచారకులకు, ప్రచారకుల సమాచారాన్ని అందుబాటును వారికి అందించి సంపర్క సూత్రంగా వెలుగొందాలి. మనం సమాజంలో ఏ ఆదర్శ మార్పులనైతే ఆశిస్తున్నామో, ఆ ఆదర్శాలన్నీ ఉత్కృష్ట స్థాయిలో మన కార్యాలయంలో ఆచరింప బడాలి. మనకు సమాజం ఇలాంటి ఆస్తులు ఎన్ని కల్పించినా సంఘ్ యొక్క ఏకైక ఆస్తి సంఘ్ శాఖ మాత్రమే, అందులో సాన పెట్టబడిన స్వయం సేవకులు మాత్రమే. సంఘ్ వ్యక్తి నిర్మాణం తప్ప మరే పని చేయదు. సంఘ్ శాఖలో తయారైన స్వయం సేవకులు మాత్రమే సమాజోద్దరణ పనులు స్వచ్ఛందంగా చేపడతారు. సదరు కార్యక్రమంలో జిల్లా వ్యాప్త జ్యేష్ట స్వయం సేవకులు, సంఘ్ శ్రేయోభిలాషులు, స్వయం సేవకులు, తదితర పెద్దలు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాన్ని ఆద్యంతం ఆస్వాదించారు.







# ప్రీ ప్రైమరీ డిజిటల్ ఉపకరణాల ప్రారంభం



**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):**మండలం లోని పిక్లా తండ శివారు బోడ గుట్ట తండాలో పూర్వ ప్రాథమిక విద్య తరగతుల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన డిజిటల్ ఉపకరణాలను గ్రామ సర్పంచ్ ఝాన్సీ నరేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ తరగతుల కోసం వచ్చిన మంచి ఉపకరణాలను ఉపయోగించుకొని విద్యాభివృద్ధికి దోహదపడాలన్నారు. పూర్వ ప్రాథమిక పాఠశాల బోడగుట్ట తండాకు మంజూరు అయి నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. పాఠశాలకు వచ్చిన రకరకాల టిఎల్ఎం, రంగు రంగులతో కూడిన చిత్రాలు, పిల్లలను ఆకర్షించే విధంగా ఉన్న బోర్డులు, ఆట వస్తువులు, కుర్చీలు, అద్దాలు ప్లేవే మెథడ్ లో ఉపయోగించే వస్తువులు, డిజిటల్ ఉపకరణాలు పిల్లలకు బాగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డివి రమణ, ఉపాధ్యాయుడు గనే యాదగిరి, ప్రీ ప్రైమరీ టీచర్ గుగులోతు మైబు, గుగులోతు శిరీష, అంగన్వాడి టీచర్ గుగులోతు నీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతల స్వీకరించిన కేసముద్రం పుర పాలకవర్గం





## ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఏ మురళీ నాయక్.

**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):** కేసముద్రం పురపాలక సంఘం నూతన కార్యవర్గం గురువారం బాధ్యతలు స్వీకరించింది. కేసముద్రం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మురళి నాయక్ ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించి ఇచ్చిన విజయంతో నిరంతరం ప్రజా సేవలో, ప్రజల కష్టాల్లో అండగా ఉంటూ వార్డుల అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్ లకు అభినందనలు తెలుపుతూ కేసముద్రం మున్సిపల్ అభివృద్ధికీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ అందరూ సమన్వయంతో పని చేసి పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్ లతో పాటు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అయితే పదవీ బాధ్యతల స్వీకారానికి బిఆర్ఎస్ కౌన్సిలర్ లు ఆలస్యంగా హాజరయ్యారు. గురువారం నిర్వహించిన కార్యక్రమం పదవీ బాధ్యతల స్వీకారంలా లేదని, కాంగ్రెస్ కార్యక్రమంగా నాయకులు ఏకపక్షంగా నిర్వహించారని బిఆర్ఎస్ నాయకుల గుసగుసలు వినిపించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజలు, మహిళలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# బిఆర్ఎస్ కౌన్సిలర్లను సన్మానించిన జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

**ప్రజల పక్షాన నిలబడాలని పిలుపు.**



**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):**ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి కౌన్సిలర్ లుగా గెలిపించారని, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం నుండి కొట్లాడి అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా కృషి చేయాలని, నిరంతరం ప్రజాపక్షం వహించాలని బిఆర్ఎస్ కేసముద్రం మున్సిపాలిటీ కౌన్సిలర్లకు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ కౌన్సిలర్లు జాటోత్ సుజాత హరీష్ నాయక్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షురాలిని గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. మహిళా కౌన్సిలర్లకు చీర, సారేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కేసముద్రం పురపీఠం దక్కలేదని అధైర్య పడవద్దని, ప్రజలంతా బిఆర్ఎస్ వెంటే ఉన్నారని తెలిపారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గద్దెదించడం ఖాయమని, మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు.



# నగదు రహిత ఆరోగ్య పథకంలో ఉపాధ్యాయుల వాటా బేసిక్ పేలో 1.5 నుండి 0.5 శాతం కు తగ్గించాలి.



## టిపిటిఎఫ్ కేసముద్రం మండల అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్.

**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):**ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన నగదు రహిత ఆరోగ్య పథకం నిజంగా అభినందనీయం అయినప్పటికీ ఈ పథకం అమలుకై ఉద్యోగస్తుల జీతం మూల ధనంలో 1.5 శాతం ప్రతి నెల కోత విధించడం సమంజసం కాదని, ప్రభుత్వం తక్షణమే పునఃసమీక్ష జరిపి నిమిత్తమాత్రంగా 0.5 శాతం ఉండేలా చర్య తీసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో టిపిటిఎఫ్ కేసముద్రం మండల అధ్యక్షులు గుండు సురేందర్ నేతృత్వంలో కేసముద్రం(వి) ప్రాథమిక పాఠశాలలో, ప్రధాన కార్యదర్శి నన్నపురాజు నరసింహరాజు నేతృత్వంలో అర్పణపల్లి పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వంలో భాగమేనని, వీరి సంక్షేమం చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, వీరికి వైద్యాన్ని ఉచితంగా అందించాల్సి ఉందని, కానీ ఉద్యోగుల నుండి ప్రతి నెల వారి వాటా రూపంలో అధికంగా జీతంలో కోత విధించడం అన్యాయమేనన్నారు. ఇది ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ చేసినట్లుగానే ఉందని అభిప్రాయపడ్డారు. అంతే కాదు పెన్షన్ లేని (సిపిఎస్) ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ అనంతరం వారికి పెన్షన్ రానందున ఏ విధంగా ఈ నగదు రహిత వైద్యాన్ని అందిస్తారో స్పష్టత లేదన్నారు. వారి ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఏ విధంగా హామీ ఇస్తుంది? అని ప్రశ్నించారు. ఇది కేవలం ఆర్థిక అంశం మాత్రమే కాదుఉద్యోగుల భవిష్యత్తు భద్రత, కుటుంబాల సంక్షేమం కూడా ఇందులో భాగమేనని అన్నారు. అలాగే ఈ పథకాన్ని కస్తూరిబా, మోడల్ స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా వర్తింపచేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు వీసం నర్సయ్య, ఊట్కూరి ప్రణయ్ కుమార్, అప్పాల నాగరాజు, ఉపాధ్యాయులు భూక్య శ్రీను, విజయ్, సురేష్ కుమార్, రమాదేవి, సోమ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## తాత జ్ఞాపకార్థం .. సేవా మార్గంలో "వేం" మనవళ్లు.

**అర్పణపల్లి, కిష్టపురం తండాలో రూ.40 వేల విలువైన బల్లాల పంపిణీ.**

**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):**పెద్దల జ్ఞాపకాన్ని కేవలం సంస్మరణలకు పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా నిలబెట్టిన ఒక ఆదర్శ ఘటన అర్పణపల్లి గ్రామంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన వేం పురుషోత్తం రెడ్డి స్మారకార్థంగా ఆయన మనవళ్లు అర్ణవ్ కృష్ణరెడ్డి, అవ్యాన్ రెడ్డి కలిసి సుమారు రూ.40 వేల విలువైన బల్లాలను అర్పణపల్లి గ్రామ స్మశానం వాటికలో, కిష్టపురం తండాలో ఏర్పాటు చేశారు. స్మశాన వాటికలో అవసరాన్ని గుర్తించి గ్రామ స్మశాన వాటికకు వచ్చే మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు నిలబడి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు విశ్రాంతి తీసుకునేందుకు సరైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న సమస్యకు పరిష్కారంగా సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేశారు. అలాగే కిష్టపురం తండాలో గ్రామ పంచాయతీలో ప్రజలకు ఉపయోగపడేలా బల్లలు అందజేశారు. అక్కడి ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. చిన్నతనంలోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేం పురుషోత్తం రెడ్డి మనవళ్ళను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.



# హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు.

**కర్నూలు నంది పత్రిక.....** ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడు అయిన బోయ గిడ్డయ్య ఏ సంతెన్న కు జీవిత ఖైదు శిక్ష విధించినట్లు కర్నూలు ఒకటవ అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి పి. కమల దేవి తెలియజేశారు. ఉలిందకొండ పి.ఎస్. క్రైమ్ నెం. 76/2016, సెక్షన్లు 302, 201, 379 తీ/ష 109 ఐపీసీ ప్రకారం నమోదు చేయబడిన కేసులో, ఫిర్యాదుదారుడు ముల్లా ముర్తుజావలి, వయసు 40 సంవత్సరాలు, ఉలిందకొండ గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా . గూడూరు గ్రామానికి చెందిన 8 సంవత్సరాల బాలిక హత్యకు గురైన ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



**ఈ కేసులో నిందితులు:** బోయ గిడ్డయ్య ఏ సంతెన్న, వయసు 60 సంవత్సరాలు, ఎర్రకత్వ గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా. బోయ తలారి రంగడు, వయసు 35 సంవత్సరాలు, గూడూరు గ్రామం & మండలం, కర్నూలు జిల్లా. దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయగా, కేసు విచారణ చేపట్టారు . కర్నూలు 1 వ అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి పి. కమల దేవి గురువారం తీర్పు వెలువరించారు.

**కోర్టు తీర్పు ప్రకారం:** నిందితుడు బోయ గిడ్డయ్య ఏ సంతెన్న ను సంబంధిత నేరంలో దోషిగా నిర్ధారించి, జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.7,000/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించనిపక్షంలో అదనంగా 2 నెలల 15 రోజుల పాటు జైలు శిక్ష ఉంటుంది. నిందితుడు బోయ తలారి రంగడు ను సాక్ష్యాల లోపం కారణంగా విముక్తి కల్పించారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా అప్పటి కర్నూలు రూరల్ సి.ఐ నాగరాజు యాదవ్ కృషి చేశారు. ముద్దాయికి శిక్ష పడుటకు కృషి చేసిన కర్నూలు రూరల్ సి.ఐ వీ.చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్సై ధనుంజయ , కోర్టు కానిస్టేబుల్ లను కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ అభినందించారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై ప్రజల్లో అవగాహన సదస్సులు

**మహానంది ఫిబ్రవరి 26 (నంది పత్రిక):-** ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై ప్రజల్లో ఉన్న అపోహాలు తొలగిస్తామని ఎంపీడీవో మహబూబ్ దౌలా,ఏపీవో మల్లికార్జున తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. కొత్త చట్టంలో భాగంగా వేతనాలు ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తారని, 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచారని చెప్పారు. 100 పని దినాలు పూర్తి చేసిన శ్రామిక కుటుంబాలను సన్మానిస్తారని చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. మొదటి వారములో ఉపాధి హామీ పథకం పేరు మార్పు పై ఉన్న అపోహాలు తొలగించనున్నట్లు తెలిపారు. 2 వ వారము శ్రామికుల హక్కుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత ప్రతిజ్ఞ రూపంలో తెలియజేయడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే ఉపాధి శ్రామికులకు సకాలంలో వేతనాలు చెల్లింపులు చేస్తారని భరోసా కల్పిస్తున్నారు. 3వ వారము ప్రతి గ్రామ పంచాయతీలో రచ్చబండ ఏర్పాటు చేసి గ్రామసభ నిర్వహించి పెద్దలు, ప్రజలు, రైతులతో చర్చించడం జరుగుతుందన్నారు. 4వ వారము గ్రామ సర్పంచ్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడి సిబ్బంది, ఉపాధి హామీ పథకం శ్రామికులు ర్యాలీ నిర్వహిస్తూ గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు చిత్ర లేఖనంతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ వారము మండల స్థాయిలో ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులు, ప్రజా ప్రతినిధులకు వి బి జి రాంజీ చట్టంపై గ్రామ,మండల స్థాయిలో చర్చలు ఉంటాయన్నారు. 6వ వారము ఉపాధి హామీ పథకం లో 100 పూర్తి చేసిన శ్రామికుల కుటుంబాలు సన్మానించడం జరుగుతుందన్నారు.



## వందేళ్ళ కమ్యూనిస్ట్ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ.



**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):** ఫిబ్రవరి 27న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కమ్యూనిస్ట్ మహాసభ జరిగి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని కోరుతూ కేసముద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ( ఎంఎల్ ) డెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ నాయకుడు బట్టు నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశం ఒక అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ అని, దీనిని కూల్చివేసి నూతన వ్యవస్థ ఏర్పాటు చేయడం కోసం విప్లవ పంథాలో కమ్యూనిస్ట్ నాయకులు అందరూ కలిసి నూతన నాయకత్వం ఏర్పాటు చేసుకోవడానికి ఒక మహాసభ ఏర్పాటు చేశారని, ఆ మహాసభ ఏర్పడి వందేళ్ళు పూర్తి అయినా సందర్భంగా న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలనీ బట్టు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల నాయకులు మునిగంటి సుధాకర్, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు మిట్టగడుపుల వెంకన్న, హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు కేసముద్రం పట్టణ అధ్యక్షులు బండి రాజు, నాయకులు పి.శ్రీను, ఎస్ సంజీవ, ఆదినారాయణ, సురేష్, ముత్యాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయల వేతనం ఇవ్వాలి.

### జల్లే జయరాజ్ సిఐటియు మండల కార్యదర్శి.



**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):** గురువారం కేసముద్రం మండల కేంద్రంలోని వెంకటగిరి, కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాలలను సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజ్ సందర్శించిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు పదివేల రూపాయలు ఇస్తామని చెప్పి, అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇచ్చిన హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్ అవుట్ తగ్గించడంలో, మధ్యాహ్న భోజన పథకం పేద, మధ్య తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, డ్రాప్ అవుట్ లు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం బాధాకరమన్నారు. ఇప్పటికీ చాలా పాఠశాలల్లో వంట గదులు లేక చెట్ల కిందనే వంటలు వండడం వల్ల అన్నం ఉడికి ఉడకక కొన్నిచోట్ల విద్యార్థిని విద్యార్థులు అన్నం తినలేని సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. పాఠశాలల్లో మెనూ ప్రకారంగా వారానికి మూడుసార్లు ఎగ్స్ ఇవ్వాలని ఉన్న ఒక్కో కోడి గుడ్డు ధర 8 రూపాయలు ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ఆరు రూపాయలు చెల్లిస్తున్నారని, దీనివల్ల ఒక్కో కోడిగుడ్డుకు రెండు రూపాయల చొప్పున కొనుగోలు చేసి కార్మికులు విద్యార్థులకు వడ్డిస్తున్నారని, ఇట్టి భారం మధ్యాహ్న భోజన కార్మికులపై పడుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నెలకు రూ.3 వేల రూపాయల వేతనం పూర్తిగా పడటం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని వంట గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సప్లై చేయాలని, వంట గదులు లేని చోట వంట గదులు నిర్మించాలని, పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శీలం ఈశ్వరమ్మ, మునిగే సావిత్ర, గడ్డం కోమల పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో 27 వసంతాలు పూర్తి చేసుకున్న కేసముద్రం తహశీల్దార్.

### శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ శ్రీనివాస్ నాయక్.

**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):** రెవెన్యూ శాఖ ఉద్యోగంలో చేరి పని చేసిన ప్రతిచోట ప్రజల మన్ననలు పొందిన కేసముద్రం తహశీల్దార్ జి.వివేక్ విధి నిర్వహణలో 27 వసంతాలు పూర్తి చేసుకున్నారు. గురువారం కేసముద్రం తహశీల్దార్ కార్యాలయంలో నర్సంపేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, సామాజిక జాతీయ భావం గల ఉద్యమనేత తెలంగాణ శ్రీనివాస్ నాయక్ మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మొదటి పోస్టింగ్ జనగామలో ప్రారంభమై నేలకొండపల్లి లాంటి ప్రముఖ మండలాలలో ప్రజలకు సేవలందించి కేసముద్రంలో 27 వసంతాలు పూర్తి చేసుకోవడం హర్షించదగ్గ విషయమని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. చివరి వరకు ఇలాగే ప్రజలకు నిస్వార్థ సేవలు అందించాలని కోరుకున్నారు.



## పన్నులు ఆన్లైన్లోనే చెల్లించాలి డీడీఓ వెంకట్ శేషయ్య



**పోరుమామిళ్ల, ఫిబ్రవరి 26 (నంది పత్రిక):** ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన పన్నులను ఆన్లైన్ విధానంలోనే చెల్లించాలని బద్వేల్ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వెంకట్ శేషయ్య సూచించారు. గురువారం మండలంలోని రంగసముద్రం, పోరుమామిళ్ల పంచాయతీల్లో నిర్వహించిన పన్ను వసూలు ప్రత్యేక డ్రైవ్ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడిన ఆయన, పన్నులు చెల్లించడం వల్ల పంచాయతీ అభివృద్ధికి ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే సెల్ఫోన్ ద్వారా ఆన్లైన్లో పన్నులు ఎలా చెల్లించాలో అవగాహన కల్పించి, పంచాయతీ ఖాతాలో జమ చేయించారు. ఆస్తి పన్నులతో పాటు నీటి కొళాయి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్నులను కూడా అందరూ తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. పంచాయతీరాజ్ కమిషనర్ నూరు శాతం పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారని, దీనికోసం సిబ్బంది మరియు పంచాయతీ అభివృద్ధి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఎన్నికల్లో పోటీ చేయాలంటే పన్ను బకాయిలు లేకుండా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పన్ను బాధ్యతను గుర్తించి సకాలంలో చెల్లించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## ఫోక్స్ చట్టం, బాల్య వివాహాలపై అవగాహన.. ఎస్ఐ,మల్లికార్జున

### మత్తు పదార్థాలు వద్దు... చదివే ముద్దు.మహిళా భద్రత కోసం

### శక్తి యాప్ యొక్క ప్రాధాన్యత గూర్చి విద్యార్థులకు అవగాహన - ఎస్సై మల్లికార్జున





**జూపాడుబంగ్లా: ఫిబ్రవరి: 26: (నంది పత్రిక)** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఐ. మల్లికార్జున ఫోక్స్ చట్టం, బాలవిహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్ ఐ. మల్లికార్జున మాట్లాడుతూ ఫోక్స్ చట్టం, దాని శిక్షలు, బాల్య వివాహాలు, వాటి చట్టపరిమన పరిణామాలు, అంతే కాకుండా వివిధ రకాల చట్టాలపై అవగాహనను విద్యార్థులను ఉద్దేశించి స్పష్టంగా వివరించడం జరిగిందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని, క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని వారు తెలిపారు. ఆసక్తితో చదువుతూ మంచి భవిష్యత్తు కోసం లక్ష్యంపై దృష్టి పెట్టాలని వారు తెలిపారు. ఏదైనా అసౌకర్యకరమైన జరుగుతే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళా భద్రత కోసం శక్తి యాప్ ప్రాముఖ్యతను తెలియజేశారు. అత్యవసర పరిస్థితిలో పోలీస్ సహాయానికి 100/112, బాల్య వివాహాల సమాచారానికి చైల్డ్ హెల్ లైన్ 1098. నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సెల్ ఫోన్లను దుర్వినియోగం చేయకుండా. సైబర్ భద్రత, పాటించాలని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. బాలికలకు ప్రత్యేకమైన చట్టం ఉందని, ఆ చట్టం ద్వారా అందరికీ మంచి భద్రత కలుగుతుందని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థినీలు అందరూ కూడా చక్కటి చదువును కొనసాగించాలని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యముతో ముందడుగు వేయాలని వారు పిలుపునిచ్చారు. పాఠశాల అధికారులు విద్యార్థిని విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పాఠశాల ప్రాంగణంలో 09 సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.



## శ్రీ నవజ్యోతి పబ్లిక్ స్కూల్ లో స్వయం పాలన దినోత్సవం



**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):** కల్వల గ్రామంలోని శ్రీ నవజ్యోతి పబ్లిక్ స్కూల్ లో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ స్వయంపాలన దినోత్సవ కార్యక్రమంలో హెచ్ఎం గా అడ్డూరి విద్యశ్రీ, ఎంఈఓగా బొడ్డు స్టాలిన్, ఉపాధ్యాయులుగా పోరండ్ల శ్రీనక్షత్ర, అజ్మీర వర్షిత, పులిగిల్ల రిత్విక, పెద్దారపు రిషిక, గొట్టం శ్రీతన్ మురళి, ఆరెపు శివ తేజ్, సుతారి మేఘన, సుంకరి శ్రేయాస్, అటెండర్ గా వేముల శివ పాల్గొన్నారని పాఠశాల కరస్పాండెంట్ పెరుమాండ్ల ఎల్లాగౌడ్, ప్రధానోపాధ్యాయులు పెరుమాండ్ల రేణుక, ఉపాధ్యాయులు మండ అనూష, జంపాల ఈశ్వరిలు తెలిపారు.

## ఎర్రమటం వెంకటరెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి సంతాపం.

**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని ఎర్రమఠం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ముఖ్య అనుచరుడు కొండకింద వెంకటరెడ్డి క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ గురువారం ఉదయం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేరుకొని వెంకట రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యాన్ని కల్పించారు.



## మొక్కు తీర్చుకున్న ఉద్యమ కళాకారుడు తరాల సంపత్.

**కేసముద్రం, ఫిబ్రవరి 26(నంది పత్రిక):** కేసముద్రం మున్సిపాలిటీకి ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 5, 6వ వార్డుల్లో పోటీచేసిన బిఆర్ఎస్ గెలవాలని, గెలిస్తే కేరళలోని గురువాయర్ వస్తానని, బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేసిన కేసముద్రం మున్సిపల్ పరిధి అమీనాపురానికి చెందిన తెలంగాణ ఉద్యమ కళాకారుడు, బిఆర్ఎస్ మండల బిసి సెల్ అధ్యక్షుడు తరాల సంపత్ గురువారం తను మొక్కుకున్నట్లే బిఆర్ఎస్ అభ్యర్థులు పురం రాజమణి రమేష్, పాయిరాల శరత్ లు కౌన్సిలర్లుగా విజయం సాధించడంతో కేరళలోని గురువాయర్ శ్రీ కృష్ణ ఆలయాన్ని సందర్శించి మొక్కు తీర్చుకున్నాడు.



## బ్రిటన్ ఎంపీని అరెస్ట్ చేసేందుకు ఇంటర్ పోల్ సాయం కోరనున్న బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మేనకోడలు, బ్రిటన్ ఎంపీ టులిప్ రిజ్వానా సిద్దిఖ్ను అరెస్ట్ చేసేందుకు ఇంటర్పోల్ 'రెడ్ నోటీసు' జారీ చేయాలని ఢాకా కోర్టు అధికారులను ఆదేశించింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్ అవినీతి నిరోధక కమిషన్ (ఏసీసీ) దాఖలు చేసిన అప్పీల్పై విచారణ జరిపిన ఢాకా మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జి సబ్బీర్ ఫైజ్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానిగా తన అత్త షేక్ హసీనా పలుకుబడిని ఉపయోగించుకుని, ఢాకాలోని గుల్షన్లో ఉన్న ఓ ఫ్లాట్ను ఎలాంటి చెల్లింపులు చేయకుండా అక్రమంగా సొంతం చేసుకున్నారని టులిప్పై ఏసీసీ ఆరోపించింది.

# రోడ్డు ప్రమాదాలు లఘుచిత్రం విడుదల చేసిన అర్బన్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి.





**నందికొట్కూరు ఫిబ్రవరి 26( నంది పత్రిక)** రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరు పై ప్రజలకు మరింతగా అవగాహనా మేరకు జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అవగాహనా కార్యక్రమాల తోపాటుగా దృశ్యం రూపంలో ఓ లఘు చిత్రము రూపొందించి ప్రజల అవగాహన కల్పించడంలో మమేకమైన స్థానిక పట్టణ కళాకారులకు ఆయన ధన్యవాదాలు తెలుపుతూ మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా, మైనర్లకు వాహనాలు ఇస్తూ తప్పిదాలను చేయడం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి సురక్షితమైన ప్రయాణాలు కొనసాగించాలని అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐలు చంద్రశేఖర్, సురేష్ లతో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ ఇలాంటి అంశాలపై చిత్రీకరించిన లఘు చిత్రాన్ని డైరెక్టర్ రాముడు మరియు నిర్మాత నటుడు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులతో కలసి డ్రంక్ అండ్ డ్రైవ్ లఘు చిత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా టిడిపి నాయకురాలు డాక్టర్ వనజ డాక్టర్ పాత్రలో పోషించగా, యముడి పాత్రలో డాక్టర్ దీ శెట్టి శ్రీనివాసులు నటించారు. అర్బన్ పోలీస్ శాఖ సమర్పణలో నిర్మించిన లఘు చిత్రం వీక్షించిన సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి నటించిన కళాకారులను, లఘు చిత్రంలో పాల్గొన్న పోలీస్ కానిస్టేబుల్ మరియు సిబ్బంది కి మెమొంటో మరియు శాలువతో సన్మానించి అభినందించారు. సమాజంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ పై పోలీస్ శాఖ చేపడుతున్న ప్రత్యేక కృషిలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తూ కృషి చేస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డిని రఘు చిత్ర డైరెక్టర్ రాముడు,దిశెట్టి శ్రీనివాసులు మరియు లఘు చిత్ర దాతలు, డాక్టర్ వనజ సంయుక్తంగా అందరూ కలిసి శాలువతో ఘనంగా సన్మానించి సిఐని అభినందించారు. ఈ కార్యక్రమంలో లఘు చిత్ర కళాకారులు, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఐపీఎస్ సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్

ఆంధ్రప్రదేశ్ రాజకీయ, పోలీస్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించిన రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు సరికొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌కు సంబంధించి గుంటూరు న్యాయస్థానం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా విచారణకు గైర్హాజరవుతున్న సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం బీహార్‌లో ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న నాయక్‌ను తీసుకొచ్చేందుకు ఏపీ పోలీసులు ఇప్పటికే పాట్నాలో పాగా వేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ రఘురామను అరెస్ట్ చేసిన సమయంలో, కస్టడీలో ఆయనపై అమానుషంగా భౌతిక దాడి జరిగిందన్న ఆరోపణలపై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా పోలీసులు నిన్న కోర్టులో వారెంట్ పిటిషన్ దాఖలు చేయగా, నిందితుడి సహాయ నిరాకరణను పరిగణనలోకి తీసుకున్న కోర్టు తక్షణమే అరెస్ట్ వారెంట్‌కు పచ్చజెండా ఊపింది.అయితే, బీహార్‌లో సునీల్ నాయక్‌పై అరెస్ట్ ప్రక్రియ ఉత్కంఠకు దారితీస్తోంది. ఇప్పటికే ఏపీ పోలీసు బృందం పాట్నాలో ఆయనను అదుపులోకి తీసుకుని, ఏపీకి తీసుకొచ్చేందుకు అక్కడి కోర్టులో ట్రాన్సిట్ పిటిషన్ వేయగా... ఆ పిటిషన్ ను కోర్టు తిరస్కరించింది. అంతేకాదు, నెల రోజుల పాటు ఆయనపై ఎలాంటి చర్యలు కూడా తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఎవరికీ అందుబాటులో లేకుండా ఉన్నట్టు సమాచారం. తాజాగా గుంటూరు కోర్టు సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన నేపథ్యంలో, ఏపీ పోలీసులు మరింత పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ఆ ఐపీఎస్ అధికారిని పట్టుకునేందుకు బీహార్ పోలీస్ యంత్రాంగం సహకారం కోరుతూ, వీలైనంత త్వరగా ఆయనను గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.

# మే 3న నీట్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 26(నంది పత్రిక):-** దేశవ్యాప్తంగా మే 3వ తేదీన నిర్వహించనున్న (నీట్‌యూజి) పరీక్షలను జిల్లాలో అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి నీట్ యూజి పరీక్షల డైరెక్టర్ జనరల్ ప్రదీప్ సింగ్ కరోలా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డీఈఓ జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలలో 1,320 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ హై స్కూల్, టెక్కే జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు, ఆధార్/పాన్/ఓటర్ ఐడి/డ్రైవింగ్ లైసెన్స్ వంటి చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు మరియు పోస్ట్‌కార్డ్ సైజు ఫోటో వెంట తెచ్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడవని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, తగిన వెలుతురు వంటి మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం ప్రతి కేంద్రంలో రెండు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు అధిక ఒత్తిడిలో పరీక్ష రాస్తుండటంతో ఇన్విజిలేటర్లు సహానుభూతితో, సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా నీట్ యూజి పరీక్షల డైరెక్టర్ జనరల్ ప్రదీప్ సింగ్ కరోలా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పరీక్షా నిర్వహణలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, అవసరమైతే ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలను కూడా కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. కేటాయించిన సామర్థ్యానికి 10 శాతం అదనంగా సీట్లు ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా పాలు, వెన్న అమ్మకాలు జరిపే షాపుల విస్తృత తనిఖీలకు ఆదేశించిన జిల్లా కలెక్టర్





**ప్రజలను అనారోగ్యం పాలు చేసే కల్తీలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు**

**సమాజంలో మీ కుటుంబాల ఆరోగ్యాలు కూడా ఉన్నాయని మానవత్వంతో ఆలోచించండి**

**నిజాయితీగల వ్యాపారం మీ బిడ్డలకు, కుటుంబానికి రక్షణగా నిలుస్తుంది**

**జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న పాలు, వెన్న తనిఖీలు..**

**తనిఖీలలో భాగంగా భీమవరంలో పట్టుబడిన నకిలీ వెన్న, నెయ్యి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

**భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 26, నంది పత్రిక** జిల్లాలో కల్తీ ఆహార పదార్థాలను గుర్తిస్తే అట్టి వారిపై చర్యలు చాలా తీవ్రంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గత రెండు రోజులుగా కల్తీ పాలు, నెయ్యి లపై వస్తున్న వార్తలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ సిబ్బంది, ఫుడ్ సేఫ్టీ అధికారులను జిల్లా వ్యాప్తంగా తనిఖీలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించడం జరిగింది. తనిఖీలలో ఎవరు పట్టుబడిన వెంటనే సంబంధిత దుకాణాలను సీజ్ చేసి, అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యమును నష్టపరిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించడం ఉండదన్నారు. కల్తీ పదార్థాలను తయారు చేసే వారికి కూడా కుటుంబాలు, పిల్లలు ఉంటారని, కల్తీ లేని వ్యాపారం వారి కుటుంబంతో పాటు, సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని గ్రహించాలన్నారు. న్యాయమైన వ్యాపారం వారి పిల్లలకు, కుటుంబానికి రక్షణగా నిలుస్తుందని, అధర్మమైన చర్యలకు పాల్పడితే ఫలితాలను అనుభవించాల్సి ఉంటుందని గట్టిగా తెలిపారు. ఈరోజు భీమవరం పట్టణంలో మున్సిపల్ కమిషనర్, వారి సిబ్బంది, ఆహార భద్రతాధికారి కలిసి పాల వ్యాపారం చేసే షాపులను, నెయ్యి తయారు చేసే వివిధ వ్యాపారస్తుల షాప్ లను తనిఖీ చేసి వాటిల్లో ఉన్న కూలింగ్ బాక్సులలో ఉంచినటువంటి పాలను తనిఖీ చేయడం జరిగింది. కల్తీగా అనుమానించిన కొన్ని షాపులలో శాంపిల్స్ ని కూడా సేకరించడం జరిగిందన్నారు. పోలీస్ బొమ్మ సెంటర్ దగ్గరలోని రిలయన్స్ షాపింగ్ మాల్ పక్క సందులో నెయ్యి షాపు నందు వివిధ రకములైన క్రీములతో తయారు చేసినటువంటి నెయ్యిని పరిశీలించి కల్తీ కలిగినదిగా అనుమానించి అందులో ఉన్నటువంటి పచ్చిపాల వెన్నను అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ వుంచి నెయ్యిని తయారుచేయడం గమనించి, వెన్న, నెయ్యి శాంపిల్స్ తీసి స్టేట్ ఫుడ్ లాబరేటరీ కి పంపించడం జరిగిందన్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ ఉంచినటువంటి వెన్నను సీజ్ చేయడం జరిగినదని తెలిపారు. ఈ వ్యాపారస్తుడు ఎటువంటి అనుమతులు పొంది ఉండలేదని, ప్రతి వ్యాపారస్తుడు, పాలను సేకరించినటువంటి పాల వ్యాపారస్తులు, పాలు కలెక్షన్ సెంటర్ లు పరిశుభ్రముగా ఉంచుకొని ప్రజలకు నాణ్యమైన పాలను అందించవలసినదిగా ఆదేశించారు. ప్రతి వ్యాపారస్తుడు తప్పకుండా మున్సిపల్ ట్రేడ్ లైసెన్సు సర్టిఫికేట్ పొంది మాత్రమే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది తనిఖీలలో పట్టుబడిన వెన్నను పోలి ఉన్న పదార్థం గోన సంచి మూటలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్ కార్యాలయం నందు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంలో భీమవరం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి మరియు ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఉన్నారు. పట్టణంలో నిర్వహించిన తనిఖీలలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాంబాబు, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసు సుందర రామిరెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సోమశేఖర్, శానిటరి ఇన్స్పెక్టర్ లు, వార్డు సెక్రేటరీలు, తదితరులు పాల్గొన్నారు

# 20 ఏళ్ల తర్వాత అంగన్వాడి భవనానికి విద్యుత్ కనెక్షన్

**వెల్దండ ఫిబ్రవరి 26 ప్రతినిధి రామానుజన్** : నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం చెరుకూరు గ్రామంలోని అంగన్వాడి భవనానికి 20 ఏళ్లుగా విద్యుత్ కనెక్షన్ లేక చిన్నారులు చివర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు దాతృత్వంతో అంగన్వాడి భవనానికి గురువారం విద్యుత్ కనెక్షన్ ను ఏర్పాటు చేశారు. అలాగే విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, ప్రీ స్కూల్ విద్యార్థులకు కుర్చీలు, ఆట వస్తువులు, బొమ్మలు మరియు ఫర్నిచర్ కిటికీలు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండల్, వార్డు సభ్యులు రమేష్, లాలయ్య, అంగన్వాడీ టీచర్ లక్ష్మమ్మ, ఆయా సాబేర, జంగయ్య, శ్రీను, సందీప్, బాలకృష్ణ, బిక్షపతి, సాయి, కొండల్, పురుగుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శికి ఘన సన్మానం

**వెల్దండ ఫిబ్రవరి 26 ప్రతినిధి రామాంజనేయులు** : తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కస్తూరి ఆంజనేయులు గౌడ్ ను రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకొని, నూతన కార్యదర్శిగా ఎన్నికైన ఆంజనేయులుకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు, మరియు బాల స్వామి గౌడ్, తిరుపతి యాదవ్, భాను ప్రకాష్ గౌడ్, రమేష్ రావు, నాగరాజు, రఘు గౌడ్, రమేష్ గౌడ్, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వెలుగోడులో కరెంట్ వైర్లు దొంగతనం

**వెలుగోడు, ఫిబ్రవరి 26 (నంది పత్రిక):** వెలుగోడు గ్రామంలో కరెంట్ వైర్లు దొంగతనం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన నారబోయిన మధు తన వ్యవసాయ పొలంలో గాలేరు నుండి మోటార్ ద్వారా పొలానికి నీరు పెట్టేవాడు మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు నీరుపారుదల చేసి ఇంటికి వెళ్లిపోయాడు.మరుసటి రోజు బుధవారం ఉదయం 6 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లి చూసేసరికి, తన మోటార్‌కు అమర్చిన సుమారు 33 మీటర్ల పొడవు గల కరెంట్ వైర్లు గుర్తు తెలియని దుండగులు దొంగలించినట్లు గుర్తించాడు. దొంగిలించబడిన వైర్ల విలువ సుమారు రూ. 3,300/- అని బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు బాధితుని ఫిర్యాదు ఆధారంగా వెలుగోడు పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగలను గుర్తించే చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సర్పంచ్

**వెల్దండ ఫిబ్రవరి 26 ప్రతినిధి రామానుజన్** : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యమైన విద్యార్థులకు ఆహారాన్ని వడ్డించాలని సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్ అన్నారు. గురువారం బొల్లంపల్లి ప్రాథమిక పాఠశాల, చల్లపల్లి, ఈదమ్మ బండ తండా ప్రాథమిక పాఠశాలలను ఉప సర్పంచ్ రామకృష్ణ, కార్యదర్శి అన్నపూర్ణ లతో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, ప్రభుత్వ పాఠశాలల లోని విద్యార్థులకు అత్యున్నత స్థాయి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే డెంగ్యూ ,మలేరియా లాంటి విష జ్వరాలు సోకుతాయని, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్కావెంజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయురాలు, మరియు నాయకులు ఆలంపల్లి కృష్ణ, ముత్య నాయక్, మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు రాజమణి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కొనసాగుతున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు





## దిగువలో శేష వాహనంపై ప్రహ్లాద వరద స్వామి

## ఎగువలో రాత్రి శరభ, దిగువలో చంద్రప్రభ వాహనంపై అహోబిలేశ్వరులు

### శేష వాహనంపై ప్రహ్లాద వరద స్వామి

**,ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 26 నంది పత్రిక** : ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలం లో అహోబిల మఠం 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ సమక్షంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆరవ రోజైన గురువారం దిగువ అహోబిలంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామానుజన్ ఆధ్వర్యంలో ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు శేష వాహనంపై అహోబిల మాడవీధుల గుండా విహరించారు. ఉత్సవ మూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామోత్సవంలో భాగంగా శేష వాహనంలో ఆసీనులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను రామానుజాచార్యుల ఆలయం వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం అహోబిలం మఠం వద్దకు తీసుకొని వెళ్లారు. అక్కడ అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శేష వాహనంలో ఆశీనుడైన ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవారును దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు అర్చకులు పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి ప్రహ్లాద వరద స్వామికి ప్రత్యేకంగా అలంకరణలు జరిపి పూజలు నిర్వహించిన అనంతరం చంద్ర ప్రభ వాహనంలో అహోబిలం మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఎగువ అహోబిలంలో: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో గురువారం జ్వాలా నరసింహా స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ఎగువ అహోబిలం మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వివిఎన్ రామానుజన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం జ్వాలా నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అర్చకులు వేద మంత్రాల మధ్య పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి జ్వాలా నరసింహ స్వామి శరభ వాహనంలో ఆసీనులను చేసి పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కాగా అహోబిల నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగే నాచ్చియార్ తిరుక్కోలం సందర్భంగా తమిళనాడు రాష్ట్రం లోని శ్రీ విల్లిపుత్తూర్ ఆండాళ్ అమ్మవారికి ధరింప చేసిన చీర చిలుకలు దండలను విల్లిపుత్తూర్ ఆండాళ్ సన్నిధిఅర్చకులు సుదర్శన్ స్వామి గురువారం అహోబిలానికి తీసుకొని వచ్చారు. చీర చిలకలను దండలను అహోబిల పీఠాధిపతి కి అందజేశారు.







# సర్పంచులను అవమానించిన డిపిఓ జగదీశ్వర్, డిఎల్పిఓ శ్రీనివాస్ లను సస్పెండ్ చేయాలి

### అధికారుల పై చట్టపరమైన చర్యలు గూర్చి మంత్రి సీతక్క, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద కు ఫిర్యాదులు చేస్తాం

### డిపిఓ జగదీశ్వర్, డిఎల్పిఓ శ్రీనివాస్ లు మా ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ, సర్పంచులకు వెంటనే క్షమాపణ చెప్పాలి

### - టి పి సి సి డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జి తిప్పారావు సంపత్



హుజురాబాద్ మండలం సింగపూర్ కిడ్స్ కాలేజీలో గత రెండు రోజులుగా.సైదాపూర్, వీణవంక మండలాల 53 మంది నూతన సర్పంచులకు నిర్వహిస్తున్న జనరల్ ఓరియంటేషన్ శిక్షణలో అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కించపరిచేలా ఉందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జ్ తిప్పారపు సంపత్ తీవ్రంగా మండిపడ్డారు. ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. శిక్షణ పేరుతో మా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, మహిళా సర్పంచులను అవమానపరిచే విధంగా ఒక నేరస్తులుగా,ఒక స్కూలు పిల్లలుగా, నిలిచోబెట్టిన డిపిఓ జగదీశ్వర్, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి సైదాపూర్, ఎంపీడీవో రాజేశ్వరరావు ఇల్లంతకుంట, ఎంపీఓ సురేందర్ వీణవంక, గ్రామ సెక్రటరీ రేవంత్ రెడ్డి, స్వచ్ఛభారత్ రమేష్ లు కుర్చీలపై కూర్చొని సర్పంచ్ లను నిలబెట్టడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని మా సర్పంచులను నిలబెట్టి, తాము మాత్రం కుర్చీల్లో కూర్చొని ఫోటోలకు ఫోజులిస్తూ అహంకారాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. పోలీసులు నేరస్తులను మీడియా ముందు ఎలాగైతే నిలబెట్టి ఫోటోలు తీస్తారో, అదే విధంగా నూతన సర్పంచులను నిలబెట్టి ఫోటోలు దిగడం వారిని అవమానించడమేనని తిప్పారపు సంపత్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను అవమానపరిచిన సదరు అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులకు కనీస గౌరవం ఇవ్వని అధికారులు శిక్షణ ఇవ్వడానికి అనర్హులు. అధికారుల నియంతృత్వ ధోరణిని సహించేది లేదు ఇలాంటి ఘటనలు మా ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా ఉన్నాయని తిప్పారపు సంపత్ హెచ్చరించారు మా సర్పంచ్ లను అవమానించిన ఈ అధికారుల పై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు , మా మహిళ సర్పంచులను అవమానించినందుకు మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేస్తాము, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, వివిధ పార్టీల సర్పంచులను అవమానించిన ఘటనను జిల్లా కలెక్టర్ సీరియస్ గా తీసుకొని వారి పై సస్పెన్షన్ వేటు వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాము ఈ సమావేశంలో టిపిసిసి లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జీడీ రవితేజ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ చిట్యాల రేవంత్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రేణిగుంట్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు



# బంగారు కుటుంబాలకు మార్గదర్శుల మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి

### అవసరమైన సౌకర్యాలను గుర్తించి సమగ్ర సహాయం అందించాలి

### వ్యవసాయ రంగ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో జిల్లా ముందంజలోకి తీసుకురావాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 26(నంది పత్రిక):-** రాష్ట్రంలో పేదరిక నిర్మూలనను లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 (ప్రభుత్వప్రైవేటుప్రజల భాగస్వామ్యం) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం విజయవాడ నుండి స్వర్ణాంధ్ర, జీరో పావర్టీ పి4 ప్రోగ్రామ్, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (ఖూ×ం) తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక & ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ పీయూష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, సీపీఓ ఓబులేసు, నోడల్ అధికారులు, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సూచనల మేరకు స్వర్ణాంధ్ర జీరో పావర్టీ పి4 కార్యక్రమంలో జిల్లాను ముందంజలో నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌పై ప్రతి నెలా సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యసాధనకు కట్టుబడి ఉన్నామని ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, జిల్లాలో ఇప్పటివరకు 44,079 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. ఈ కుటుంబాలకు మార్గదర్శులను నియమించి, వారిని త్వరితగతిన మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని మార్గదర్శుల ద్వారా సమర్థవంతంగా



అందించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన మార్గదర్శుల వివరాలను మార్చి మొదటి వారంలోపు సమర్పించాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు వైద్యసంబంధిత అత్యవసర అవసరాలుంటే, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ. 25 లక్షల వరకు, అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయం లభిస్తుందని తెలిపారు. ఈ పథకాల గురించి అర్హులైన కుటుంబాలకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. చికిత్స కోసం ఆలస్యం కాకుండా ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం, ఫోన్ ద్వారా నమోదు సౌకర్యం కూడా అందుబాటులో ఉన్నట్లు వారికి తెలియజేయాలన్నారు. ఈ ప్రక్రియలో నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ నోడల్ అధికారులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. జిల్లాను వ్యవసాయ రంగంలోని కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో మరియు స్థూల దేశీయోత్పత్తి పెంపులో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. జిల్లాలోని సుమారు 70 వేల ఎకరాల బీడు భూములను సాగులోకి తీసుకురావడంలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించిందని అభినందించారు. మహానంది మండలంలో తలసరి ఆదాయం అధికంగా ఉన్నప్పటికీ, పగిడ్యాల, గోస్పాడు, నందికొట్కూరు మండలాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ మండలాల్లో ఆదాయం పెంపుదలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ పురోగతి…ఈ మూడు అంశాలను సమన్వయంతో అమలు చేస్తూ జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల ద్వారా జన్మించిన తొలి శిశువుగా,పాప పుట్టుకతోనే కొత్త రికార్డు సృష్టించింది.

### ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.



సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ లో, గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో, ఐవీఎఫ్ చేయించుకున్న తొలి మహిళ, ఇటీవలే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల ద్వారా జన్మించిన తొలి శిశువుగా, పాప పుట్టుకతోనే కొత్త రికార్డు సృష్టించింది అని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపినారు. ఈ సందర్భంగా, హైదరాబాద్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో (××ఎఖీఔ) జరిగిన, కార్యక్రమంలో గాంధీ హాస్పిటల్ ఐవీఎఫ్ సెంటర్‌లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. ఐవీఎఫ్ సెంటర్ హెడ్, డాక్టర్ శోభ, ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ సుమిత్ర నాయర్, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఫాతిమా రాణి, ఎంబ్రయాలజిస్ట్ శివకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ పద్మావతి తదితరులను మంత్రి దామోదర రాజా నరసింహ ఘనంగా సత్కరించి, వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.



## యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం.

తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి. అన్ని నృసింహ క్షేత్రాలలాగానే ఫాల్గుణమాసంలో ఆ స్వామికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆ ఉత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవ, రథోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. వేలాది భక్తులు ఆ సందర్భంలో స్వామిని దర్శించుకుంటారు. యాదగిరిగుట్ట ఆలయం త్రేతాయుగ కాలం నాటిది. శ్రీరాముని బావగారైన ఋష్యశృంగ మహర్షి కుమారుడే యాదర్షి. ఆయన తపస్సు వల్లనే లక్ష్మీనరసింహ స్వామి యాదగిరిపై పంచనారసింహ రూపాలలో వెలిశాడు. ఆనాడు యాదమహర్షి చూసిన ఉగ్రనారసింహ రూపమే యాదగిరి గుట్ట అయిందని చెబుతారు. యాదాద్రికి క్షేత్రపాలకుడు ఆంజనేయుడు. ఆయన ఆజ్ఞ మేరకే యాదర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేయడానికి వచ్చాడు. యాదర్షి తపస్సుకు కూడా ఆంజనేయుడు ఎంతో సహాయం చేసినట్లు స్థలపురాణం చెబుతోంది. యాదాద్రిలో ప్రసన్నాంజనేయుని మనం దర్శించుకోవచ్చు. అక్కడే గండభేరుండ స్వామి దర్శనం కూడా అవుతుంది. ఆయనకు ప్రదక్షిణలు చేస్తే సర్వరోగాలు, భూతప్రేత పిశాచాదుల బాధలు పోతాయి. యోగానంద నారసింహుడు దక్షిణాభిముఖుడై యోగముద్రలో జ్ఞానదాయకునిగా ప్రసిద్ధి పొందాడు. దేవప్రాచీదిశలో వెలిసిన లక్ష్మీనృసింహస్వామి దర్శన మాత్రంతో కోరికలను నెరవేరుస్తాడు. రెండు శిలాఫలకాల మధ్య సర్పాకారంలో శ్రీచూర్ణరేఖను ధరించివున్న రూపం జ్వాలానృసింహమూర్తి. ఇక యాదాద్రి కొండంతా ఆవరించివున్న మహారూపం ఉగ్రనృసింహమూర్తి. మూలమూర్తిగా విరాజిల్లుతున్న స్వయం భూనృసింహమూర్తి ఈ పంచనృసింహుల సమ్మేళన రూపం. ఆనాటి ఆనవాళ్లు ఎన్నెన్నో... సర్వాంతర్యామి అయిన శ్రీమహావిష్ణువు ప్రహ్లాదుని కోరికమేరకు నారసింహరూపం ధరించాడు. యాదగిరిగుట్టలోని గుహలో కృతయుగం నుంచి స్వామి ఉండేవాడని ప్రతీతి. ఆ స్వామి వారిని ఆనాడు బ్రహ్మాది దేవతలు ఆకాశగంగతో అభిషేకం చేశారు. ఆ పవిత్ర పాదతీర్థం విష్ణుకుండమై పవిత్ర దివ్యధారగా యాదాద్రిలో నేటికీ భక్తులను పునీతులను చేస్తోంది. నేడు అంగరంగ వైభవంగా జరుగనున్న యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి కల్యాణం.

## విద్యార్థినుల భద్రతపై సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీసులు.



తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ తమ పరిధిలోని పాఠశాలలు కళాశాలలను సందర్శించి విద్యార్థులకు చైతన్య కార్యక్రమాలను మహిళా శక్తి టీమ్ సభ్యులు బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు బాలలపై జరిగే నేరాలు, మత్తు పదార్థాలు గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, ాతీశేవమ్‌ఱశీఅ శీట జష్ట్రఱశ్రీఎతీవఅ టతీశీఎ ావ×బుశ్రీ ాటటవఅషవం ూష్ (ూజూూ చట్టం) నిబంధనలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలు, శక్తి యాప్ వినియోగం దాని ప్రయోజనాలు, అత్యవసర సేవల కోసం డయల్ 112 వినియోగ విధానం, మహిళల రక్షణకు సంబంధించిన వివిధ చట్టాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వేధింపులు లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు వెంటనే శక్తి యాప్ ద్వారా లేదా 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి, స్వీయ రక్షణ భావనను బలపరచడం, భద్రతా పరిరక్షణపై నమ్మకం పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## అభివృద్ధిని ఓర్వలేక ఎమ్మెల్యే పై అభండాలు.

సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పై అసత్య ప్రచారాలు చేస్తూ అబాండాలు వేయడం తగదని తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన స్వర్ణ కెరటాలు ప్రతినిధితో మాట్లాడారు.సీఎం చంద్రబాబు నాయుడు రాజకీయ రంగంలో దళిత మహిళలను ప్రోత్సహిస్తూ సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి టికెట్ కేటాయించారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆమెను ఆశీర్వదించి నెలవల విజయశ్రీని ఎమ్మెల్యేగా గెలిపించి ఘన విజయం అందించారని తెలిపారు. కూటమి పార్టీ నాయకుల సహకారం ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ నెలవల విజయశ్రీ సీఎం చంద్రబాబు నాయుడు ఆశయాలను నెరవేర్చే దిశగా పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలియజేశారు అలాగే అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నారని అన్నారు.అలాంటి దళిత మహిళ ఎమ్మెల్యే పై అవినీతి ఆరోపణలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారురాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు ప్రజాసేవలో నిమగ్నమయ్యారని అన్నారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ అభివృద్ధికి తన తండ్రి అయిన సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచనలు సలహాలు తీసుకుంటే తప్పేంటి అని ప్రశ్నించారు. ప్రజల అవసరాలకు అందుబాటులో ఉండి వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటూ సీఎం చంద్రబాబు ఆదేశాలే శిరోధార్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నివాసంలో ఐదు మంది ఎమ్మెల్యేలు ఉన్నారు అనడం,అవినీతికి పాల్పడుతున్నారని అసత్యాలు ప్రచారం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని కట్టా వెంకటరమణారెడ్డి తెలియజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తన తండ్రి సూచనలు,కూటమి పార్టీ నాయకుల సహకారంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో మౌలిక వసతులను మెరుగుపరస్తూ అభివృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని ఓర్వలేని కొంతమంది ఎమ్మెల్యే పై బురదజల్లు తున్నారని అన్నారు. గత అనేకేళ్లుగా నియోజకవర్గంలో పరిష్కారం గాని సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ శాసనసభలో చర్చించి నిధులు మంజూరుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కొంతమంది ఓర్వలేని నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు ఆపకుంటే తగిన విధంగా బుద్ధి చెప్తామని హెచ్చరించారు.సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నారని టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి తెలియజేశారు.

## ఘటనలు జరిగాక స్పందిస్తే ప్రయోజనం లేదు: అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

శ్రీకాకుళం పట్టణంలో కలుషిత తాగునీటి కారణంగా డయేరియా ప్రబలడం, రాజమండ్రిలో కల్తీ పాల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోవడం వంటి తీవ్రమైన ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మున్సిపల్, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ రెండు విషాద ఘటనల్లో ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం ఉపేక్షించవద్దని అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం కావాలని స్పష్టం చేశారు. ముందస్తు చర్యలే ముఖ్యం: సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలి.

## గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్ 1 నియామకాలపై. హైకోర్టు తీవ్ర ఆగ్రహం.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాలపైన కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. విజయానంద్‌పై హైకోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల అమలులో తీవ్ర జాప్యం చేయడంపై బుధవారం జరిగిన విచారణలో ధర్మాసనం నిప్పులు చెరిగింది. "తక్షణం అనే పదానికి అర్థం తెలియదా?" అని ఘాటుగా ప్రశ్నిస్తూ, కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని గట్టిగా హెచ్చరించింది. గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం గ్రూప్-1 ద్వారా ఎంపికైన వారిని దర్యాప్తును ప్రభావితం చేయని అప్రాధాన్య (నాన్-ఫోకల్) పోస్టుల్లోకి తక్షణం బదిలీ చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఆ ఆదేశాలు అమలు కాకపోవడంపై ధర్మాసనం సీఎస్‌ను నిలదీసింది. "మీరు పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారు. మిమ్మల్ని నాలుగు రోజులు జైల్లో ఉంచితే మిగిలిన అధికారులు దారిలోకి వస్తారు. కోర్టు ఆదేశాలను సీఎస్ గౌరవించకపోతే కింది స్థాయి అధికారులు ఏం నేర్చుకుంటారు?" అని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీల వంటి కీలక పోస్టుల్లో ఉన్నవారిని బదిలీ చేయడానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించింది. "అభ్యర్థులు మిమ్మల్ని మేనేజ్ చేశారా? లేక మీరు వారితో కుమ్మక్కయ్యారా?" అంటూ సూటిగా ప్రశ్నించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) వాదనలు వినిపిస్తూ.. ఫోకల్, నాన్-ఫోకల్ పోస్టుల నిర్వచనంపై స్పష్టత లేనందునే న్యాయసలహా కోరామని తెలిపారు. ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. "ఏఐని అడిగినా ఆ పదాలకు అర్థం చెబుతుంది, మీకే తెలియదా?" అని ఎద్దేవా చేసింది. "జైలుకు వెళ్తారా? లేక ఆదేశాలు అమలు చేస్తారా?" అని సీఎస్‌ను ధర్మాసనం నిలదీయగా.. గురువారం నాటికి ఉత్తర్వులు అమలు చేసి నివేదిక సమర్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం ఈ హామీని నమోదు చేసుకుని, విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఆదేశాలు అమలు చేస్తే సీఎస్ వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

## రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికీ ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు.

ఏపీలో పౌర సేవలను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్తి పన్ను చెల్లింపులు, ఇతర పురపాలక సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సరికొత్త సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో ప్రతి ఇంటికీ, వాణిజ్య భవనానికీ ఒక ప్రత్యేక క్యూఆర్ (ఇ=) కోడ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానం ద్వారా ప్రజలు తమ స్మార్ట్‌ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఇంటి నుంచే సులభంగా పన్నులు చెల్లించవచ్చు.ఈ కొత్త విధానాన్ని త్వరలోనే అమల్లోకి తీసుకురావడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి ఇంటి గోడకు లేదా డోర్‌కు ఈ క్యూఆర్ కోడ్‌ను అంటించనున్నారు. పౌరులు తమ ఫోన్‌తో ఈ కోడ్‌ను స్కాన్ చేయగానే, ఆ ఇంటికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఇంటి విస్తీర్ణం, ఏటా చెల్లించాల్సిన ఆస్తి పన్ను మొత్తం, ఏవైనా బకాయిలు ఉంటే ఆ వివరాలు స్పష్టంగా తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు. అదేవిధంగా వ్యాపార సంస్థలు, దుకాణాల యజమానులు తమ ట్రేడ్ లైసెన్స్ ఫీజుల బకాయిలను కూడా దీని ద్వారా తెలుసుకుని చెల్లించవచ్చు.ఫిర్యాదులు ఇకపై సులభం.. కేవలం పన్నుల చెల్లింపులకే కాకుండా ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయడానికి కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. ఉదాహరణకు చెత్తను తొలగించడం లేదని ఫిర్యాదు చేయాలన్నా, మురుగునీటి పారుదల సమస్యలున్నా ఈ పోర్టల్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. దీనివల్ల అధికారులను నేరుగా కలవాల్సిన అవసరం ప్రజలకు తప్పుతుంది. ఈ క్యూఆర్ కోడ్ విధానం ద్వారా మరిన్ని అదనపు సేవలను కూడా అందించనున్నారు. కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు, ఆ ఇంటికి సమీపంలో ఉన్న థియేటర్లు, జిమ్‌లు, కల్యాణ మండపాలు, హోటళ్లు, దుకాణాలు, విద్యా సంస్థల వివరాలు కూడా కనిపిస్తాయి. వారిని సంప్రదించడానికి వీలుగా మొబైల్ నంబర్లు కూడా అందుబాటులో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో "సిటీ సర్వీస్ సెంటర్ల" కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగానే ఈ క్యూఆర్ కోడ్ ప్రాజెక్టును ఏపీలో కూడా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విధానంతో పౌర సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజల సమయం కూడా ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది

## పులికాట్ అంతర్రాష్ట్ర వివాదం పరిష్కారానికి ఎంపీ గురుమూర్తి కృషి.

పులికాట్ సరస్సు అంతర్రాష్ట్ర జల వివాద సమస్య పరిష్కారం కోసం సంబంధిత గ్రామాల మత్స్యకారులు, వారి నాయకులతో కలిసి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి జిల్లా కలెక్టరును కలిశారు. పన్నంగాడు ప్రాంతంలో ఉన్న పులికాట్ సరస్సు పబ్లిక్ మ్యాప్స్ ప్రకారం పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోనే ఉండగా, ఈ ప్రాంతం అంతర్రాష్ట్ర సరిహద్దుకు సుమారు 3.34 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు సరిహద్దులు మార్చి చేపల వేట కొనసాగిస్తున్నారని కలెక్టరుకి వివరించారు. ఈ సమస్యపై కూలంకుషంగా చర్చలు జరిపి, మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా కలెక్టరుకు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం తిరువళ్ళూరు జిల్లా కలెక్టరుతో సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. ప్రస్తుతం తమిళనాడులో ఎన్నికల సన్నాహాలు కొనసాగుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి కొంత సమయం పడుతుందని, ఆందోళన చెందవద్దని మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. ఈ అంశంపై సోమవారం తిరువళ్లూరు జిల్లా కలెక్టరుతో జూమ్ కాల్ ద్వారా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మాట్లాడిన ఎంపీ గురుమూర్తి ఈ అంశాన్ని ఇప్పటికే పలుమార్లు పార్లమెంటులో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేస్తూ, రాబోయే పార్లమెంటు సమావేశాల్లో మరోసారి లేవనెత్తుతానని హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. మత్స్యకారులు స్నేహభావంతో వ్యవహరించి ఎలాంటి గొడవలకు దూరంగా ఉండాలని ఎంపీ పిలుపునిచ్చారు.

## స్విమ్స్ వార్షికోత్సవంలో తుడా ఛైర్మన్.

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) 33వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్విమ్స్ సంస్థ గత మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను కొనియాడారు.స్విమ్స్ కేవలం ఒక ఆసుపత్రి మాత్రమే కాదు, వేలాది మంది పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న ఆశాజ్యోతి అని అన్నారు.రాయలసీమ ప్రాంతంలోనే కాకుండా, పొరుగు రాష్ట్రాల ప్రజలకు కూడా స్విమ్స్ ఒక నమ్మకమైన వైద్య దేవాలయంగా మారిందని ఆయన పేర్కొన్నారు.సీనియర్ వైద్యుల సలహా మేరకు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యం కోసం వచ్చిన వారికి అత్యుత్తమ వైద్య సేవలను అందించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన సూచించారు.వచ్చే ఏప్రిల్ నుండి తిరుపతి బస్ స్టాండ్,రైల్వే స్టేషన్ దగ్గర నుండి స్విమ్స్ కు వచ్చే వారికోసం ప్రత్యేకమైన వాహన సదుపాయాన్ని తుడా తరుపున ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అదేవిధంగా డాలర్స్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు పునర్జన్మ ప్రసాదిస్తున్న వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని పారామెడికల్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని, స్విమ్స్ అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.రాబోయే రోజుల్లో మరిన్ని అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా స్విమ్స్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన గుర్తుచేశారు.వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి డాలర్స్ దివాకర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని స్విమ్స్ సిబ్బంది,అధికారులు దుస్సలావతో సత్కరించి, స్వామివారి ప్రతిమని బహుకరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం జేఈఓ, బోర్డు సభ్యులు,స్విమ్స్ డైరెక్టర్, డీన్, ఇతర ఉన్నతాధికారులు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐసీసీసీ లో ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ పైన సమీక్ష సమావేశం నిర్వహించిన..

### ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



ఐసీసీసీ లో ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ పైన జరిగిన సమీక్ష సమావేశానికి ,హాజరైన సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి. ఐసీసీసీ లో ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ పైన , సమీక్ష సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కోర్ అర్బన్ రీజియన్ లో , ప్రభుత్వ స్కూల్స్ లో, మౌలిక సదుపాయాల కల్పన పైన దృష్టి సారించాలి అని తెలిపారు.ఇంటి గ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం లో రాజీ పడొద్దు అని, భారతీయ విద్యా భవన్,జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ లల్లో , ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలి అని తెలిపారు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ను పకడ్బందీగా అమలు చేయాలి అని, బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ లో తప్పని సరిగా పాలు ఆదించాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపినారు. విజయా డైరీ నుంచి పాలు సేకరించాలి.మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీ వినియోగించాలి అని తెలిపినారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాలలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహా లో

ట్రాన్స్పోర్ట్ తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలి అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్ ల ఏర్పాటు పైన అధ్యయనం చేయాలి.ప్రైవేట్ స్కూల్స్ లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు తో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలి అని తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ లో ఫీజుల నియంత్రణ కు సంబంధించి రికమండేషన్స్ ని ప్రజాభిప్రాయం కోసం వెబ్సైట్ లో ఉంచాలి అని సమీక్ష సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులకు తెలిపినారు.



## అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్ గా తెలంగాణ.

**2047 నాటికి ఈ రంగంలో తిరుగులేని శక్తిగా రాష్ట్రం.**

**'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు.**

**'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు.**




తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్ లల్లో ఒకటిగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆ దిశగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ఇంటిగ్రేషన్, పాలసీ అండ్ రెగ్యూలేటరీ ఫెసిలిటేషన్, సస్టైనబిలిటీ అండ్ గ్రీన్ లాజిస్టిక్స్, స్కిల్ డెవలెప్ మెంట్ అండ్ ఇన్నోవేషన్ తో కూడిన 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ముంబై లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో 'మెస్సే ముంచెన్ ఇండియా(మెస్సే ముంచెన్ జర్మనీ అనుబంధ సంస్థ)' నిర్వహిస్తోన్న 'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించే కీలక రంగాల్లో ప్రధానమైన 'లాజిస్టిక్ రంగం'లో 2047 నాటికి తెలంగాణను తిరుగులేని శక్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు.భౌగోళిక విస్తీర్ణంలో పదకొండు, జనాభాలో పన్నెండో స్థానంలో ఉన్న తెలంగాణ వాటా దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉందన్నారు.దీనిని 2047 నాటికి 10 శాతానికి పెంచాలనే సంకల్పంతోనే 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ కు శ్రీకారం చుట్టామన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చేర్చాలనే లక్ష్య సాధనలో లాజిస్టిక్ రంగానిదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసుల పునర్నిర్మాణం, ఏఐ ఆధారిత ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్, సస్టైనబిలిటీ అనే మూడు ప్రధాన మార్పులు లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయన్నారు.ఇలాంటి తరుణంలో భౌగోళికంగా మనకున్న అనుకూలతలను 'డిజైన్ అడ్వాంటేజ్'గా మార్చుకుని సత్తా చాటేలా ముందు కెళ్తున్నామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో ఫేజ్ 2, కొత్త ఎయిర్ పోర్టులు, డ్రై పోర్టు, తెలంగాణ లాజిస్టిక్స్ పాలసీ 2.0, లాజిస్టిక్ హబ్స్ తదితర ప్రాజెక్టులు ఈ రంగంలో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా మార్చు తాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్ ను తయారు చేస్తున్నామని పునరుద్ఘాటించారు. కేవలం వస్తువులను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని ప్రపంచం ఊహించని వేగంతో డెలివరీ చేసి 'లాజిస్టిక్ పవర్ హౌస్'గా ఎదిగే సత్తా తెలంగాణకు ఉందని స్పష్టం చేశారు. మల్టీ మోడల్, రైల్ లింక్డ్ అసెట్స్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర కేటగిరీల్లో పెట్టుబడులు పెట్టి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.వేగవంతమైన అనుమతులు, పారదర్శకమైన పాలసీలు, ప్రోత్సాహకర విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



# పాపం ఒకరిది... ప్రాయశ్చిత్తం మరొకరిది!

మధ్యప్రాచ్యంలో 1979 నుంచీ ఇరాన్ అమెరికాకు కొరుకరాని కొయ్యగానే ఉంది. అప్పటి నుంచి సందర్భం వచ్చినప్పుడల్లా తిరుగుబాట్లను ఉసిగొల్పటానికి చేయాల్సినదంతా చేసింది. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం వచ్చిందంటూ అగ్రరాజ్యం ఇప్పుడు మళ్లీ బహిరంగంగా ప్రకటించటమే గాక అందుకు పూర్తిగా సహాయసహకారాలు అందిస్తామని అక్కడి ఆందోళనకారులకు భరోసానూ ఇచ్చింది. ఇజ్రాయెల్‌తో కలిసి బహిరంగంగా, రహస్యంగా పావులన్నీ కదిపినా ఆశించిన ఫలితం కనపడలేదు. ఇరానీయుల అసంతృప్తి, ఆగ్రహం అక్కడి ప్రభుత్వాన్ని కూలదోసే స్థాయిలో సంఘటితం కాలేదు. అందుకే అణురాగంలో మాటలు తీవ్రమయ్యాయి. తమతో, తమకు నచ్చిన రీతిలో అణు ఒప్పందం చేసుకోకపోతే విధ్వంసం తప్పదనే హెచ్చరికలు ముమ్మరమయ్యాయి. అసలు ఎలాంటి ఒప్పందం కావాలో, దాంట్లో ఏం ఉండాలో ఇంతవరకూ అమెరికా స్పష్టం చేయలేదు. గతంలో చేసుకున్న ఒప్పందంలో లోపాలేమిటో నిర్దిష్టంగా చెప్పనూలేదు. అమెరికాతో సహా చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలకు ఆమోదయోగ్యమైన 2015 నాటి ఒప్పందం పనికిరాదంటూ దాన్నుంచి ఏకపక్షంగా వైదొలగుతూ ఆదేశాలు జారీచేసిన డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు కొత్తదానికి ఇరాన్ ముందుకు రావటం లేదంటూ సైనికదాడికి సర్వసన్నాహాలు చేస్తున్నారు. 2003లో ఇరాక్‌పై దాడి చేసినట్టే ఇప్పుడు ఇరాన్‌పైనా చేస్తే ఫలితాలు ఇంకా దారుణంగా ఉండే అవకాశమే ఎక్కువ. ఒకవేళ సైన్యాన్ని ఇరాన్‌లోకి ప్రత్యక్షంగా నడిపించకుండా అక్కడి మతనాయకత్వాన్ని హతమార్చితే అది ఎటు దారితీస్తుందో ఊహించలేం. షియా ముస్లింల ప్రతిస్పందన ఎట్లా ఉంటుందో, అది ఏ మలుపులు తిరుగుతుందో కచ్చితంగా ఇప్పుడే చెప్పనూలేం. ఇరాక్‌లో సున్నీలు అధిక సంఖ్యాకులు కారు. కానీ దశాబ్దాలు అధికారంలో వాళ్లే ఉన్నారు. అమెరికా దాడితో ప్రభుత్వ, సైనిక పదవులను కోల్పోయిన సున్నీలను మతప్రాతిపదికమీద సంఘటితం చేసి ఇస్లామిక్ స్టేట్ పేరుతో కొనసాగిన ప్రతిఘటన ఎన్నో జీవితాలను బలితీసుకుంది. ఒకవేళ ఇరాన్‌లో అలాంటి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినా షియాలనే అందులో కూర్చోపెట్టాలి. ఇరాక్‌లోలాగా అధికార పీఠాలపైకి సున్నీల స్థానంలో షియాలు వచ్చినట్లు ఇరాన్‌లో మరోవర్గం వచ్చే అవకాశం లేదు. ఇక ఇరాన్‌లో అత్యున్నత పదవిలో ఉన్న అలీ ఖమేనేయిని భౌతికంగా లేకుండా చేయటానికి అమెరికా చేసే ఏ ప్రయత్నమైనా మతపరమైన అజెండాతో హింసాత్మక ప్రతిఘటనకు దారితీసే అవకాశం ఉంది. అది ఇరాన్‌కే పరిమితం కాదు. షియాలు గణనీయసంఖ్యలో ఉన్న అన్ని ప్రాంతాలకూ వ్యాపించే ప్రమాదం ఉంది. ఇరాక్‌లోనూ, అజర్‌బైజాన్‌లోనూ అలజడులు చెలరేగుతాయి. భారత్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లో కూడా షియాలు గణనీయసంఖ్యలోనే ఉన్నారు. ఇతర దేశాలను కూడా కలుపుకొంటే షియాలు 20 నుంచి 25 కోట్ల వరకూ ఉంటారు. బలమైన షియా ఆధిక్య దేశంగా ఇరాన్‌కు ఎప్పటి నుంచో గుర్తింపు ఉంది. అందుకే ఇరాన్‌లో ఏం జరిగినా దాని ప్రభావం షియా ప్రజలందరిపైనా ప్రగాఢంగానే ఉండొచ్చు. అగ్రరాజ్యం చేసే యుద్ధానికి కనీసంగానైనా ఏదో ఒక సమర్థనను తయారుచేసుకోవటం గతంలో ఎంతో కొంత ఉండేది. బిన్‌లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చారని అఫ్ఘానిస్థాన్‌పై యుద్ధం మొదలుపెట్టింది. భారీ జనవిధ్వంసక ఆయుధాలను కలిగి ఉన్నదంటూ ఇరాక్‌పై సేనలను నడిపించారు. ట్రంప్ వచ్చిన తర్వాత సైనిక యుద్ధాలకూ, వాణిజ్య యుద్ధాలకూ ఎటువంటి సమర్థనల అవసరం ఉండటం లేదు. 2015 నాటి అణు ఒప్పందానికి (జాయింట్ కాంప్రిహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్) అంగీకరించి దానిలోని షరతులను కచ్చితంగా అమలుచేస్తామని ఇరాన్ హామీ ఇచ్చింది. హామీని ఉల్లంఘిస్తే చర్యలు ఎంత కఠినంగా ఉంటాయో ఇరాన్‌కూ తెలుసు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలోని అయిదు దేశాలతో పాటు జర్మనీ కూడా ఒప్పందంలో భాగస్వామిగా ఉంది. 'అణ్వాయుధాలను తయారుచేయటానికి, సంపాదించటానికి ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రయత్నించబోనని ఇరాన్ పునరుద్ఘాటిస్తోంది' అన్న హామీ ఒప్పందం మొదటి పేరాలోనే స్పష్టంగా ఉంది. 15 ఏళ్ల కాలంలో యురేనియం నిల్వలను 98శాతం తగ్గించాలని కూడా ఒప్పందంలో విపులంగా పేర్కొన్నారు. అందులో భాగంగా కొన్ని నిల్వలను ఇరాన్ రష్యాకు తరలించింది. యురేనియం శుద్ధి స్థాయిని 3.67శాతానికి అంగీకరించింది. వైద్య అవసరాలకు ఉపయోగించటానికి కూడా ఈ శాతానికి కొంత మించే యురేనియాన్ని శుద్ధి చేయాలి. యురేనియం శుద్ధి సామర్థ్యాన్ని ఈ స్థాయికి తగ్గించుకున్నాక మళ్లీ మనసు మార్చుకుని అణ్వస్త్రాలు తయారుచేసే మేరకు దాన్ని తీసుకెళ్లాలంటే ఎక్కువ సమయమే పడుతుంది. ఆ లోగానే వ్యవహారాలను పసిగట్టి ఇరాన్‌ను దారిలోకి తీసుకువచ్చే సామర్థ్యం అగ్రరాజ్యాలకు ఉందని కూడా అప్పట్లో భావించారు. అనుకున్న విధంగా ఒప్పందం అమలుకు వేగంగా అడుగులు పడుతున్న నేపథ్యంలో ఇరాన్‌పై ఆంక్షలను ఎత్తివేసే క్రమం మొదలైంది. ఆంక్షలతో అన్ని విధాలుగా ఇరాన్ అప్పటికే విపరీతంగా కుంగిపోయింది. వందల బిలియన్ డాలర్ల ఆదాయాన్నీ కోల్పోయింది. 20122015 మధ్యలో ఒక్క చమురుపైనే 160 బిలియన్ డాలర్ల రెవెన్యూనీ పోగొట్టుకుంది. ఖాతాలను స్తంభింపచేయటంతో 100 బిలియన్ డాలర్లు విదేశాల్లోనే ఉండిపోయాయి. ఇరాన్‌తో అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకోవటం ఇజ్రాయెల్‌కు ఏ మాత్రం ఇష్టం లేదు. ఆ ఒప్పందాన్ని చరిత్రాత్మక తప్పిదంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు అప్పట్లోనే వ్యాఖ్యానించారు. 2016లో ట్రంప్ మొదటిసారి అధికారంలోకి రావటంతో ఒప్పందం నుంచి వైదొలగటానికి సన్నాహాలు మొదలుపెట్టారు. మధ్యప్రాచ్య వ్యవహారాల్లో ఇజ్రాయెల్ చెప్పినదానికి తలాడించటమే ట్రంప్ సారథ్యంలోని అమెరికాకు అలవాటుగా మారిపోయింది. 2018 మే 9న ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. చైనా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్ జర్మనీలతో పాటు మొత్తం యూరోపియన్ యూనియన్, టర్కీ కూడా ఇది సరైన పనికాదని విమర్శించాయి. అయినా అమెరికా లెక్కచేయలేదు. ఏడాదిపాటు ఇరాన్ వేచిచూసింది. ఒప్పందాన్ని కాపాడటానికి యూరోపియన్ యూనియన్ ప్రయత్నాలు ఫలిస్తాయేమోనని ఆశపడింది. అది ఫలించకపోగా అమెరికా ఆంక్షలను మళ్లీ విధించింది. యురేనియం శుద్ధిస్థాయిని 20శాతానికి పెంచుతామని 2019 జూన్‌లో ఇరాన్ ప్రకటించటంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఆ తర్వాత దాన్ని క్రమేపీ ఇంకా పెంచుతున్నట్లుగా ప్రకటనలు వచ్చాయి. అణ్వస్త్రాలను తయారుచేసే స్థాయికి ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం చేరుకుందనే నెపంతో కిందటి ఏడాది జూన్‌లో అమెరికా భారీ బాంబులను ప్రయోగించింది. ఇరాన్ యురేనియం శుద్ధి కర్మాగారాలన్నిటినీ దారుణంగా దెబ్బతీశామని ఘనంగానూ ప్రకటించుకుంది. అంతకుముందుగా ఇరాన్ కీలకనేతలనూ, అధికారులనూ, శాస్త్రవేత్తలనూ డ్రోన్లను ఉపయోగించీ ఇతరత్రానూ మట్టుబెట్టారు. ఒకప్పుడు మధ్యప్రాచ్యంలోనే అమెరికాకు చాలా ఇష్టమైన దేశం ఇరాన్. మహమ్మదు రెజాషా ఇరాన్ పాలకుడిగా ఉండగా అణుకర్మాగారాల స్థాపనకు అమెరికా తోడ్పడింది. అత్యాధునిక ఆయుధాలనూ, విమానాలనూ అమ్మి మధ్యప్రాచ్యంలోనే ఇరాన్‌ను సైనికంగా బలపడేటట్టు చేసింది. అమెరికా అనుకూల విధానాలతో పాటే అణచివేతను కూడా రెజాషా అమలుచేశారు. రాజకీయ స్వేచ్ఛను లేకుండా చేశారు. పౌరహక్కులను అణచివేశారు. 10 శాతం జనాభాకు మాత్రమే లాభం చేసే విధానాలను అమలుచేయటంతో అసంతృప్తులు పెరిగిపోయాయి. అసలు 1950ల మొదట్లోనే ఇరాన్‌లో అమెరికా వ్యతిరేక బీజాలు బలపడ్డాయి. అప్పట్లో రెజాషా అధికారాలు పరిమితంగా ఉండేవి. పార్లమెంట్ (మజ్లిస్) సర్వోన్నతంగా ఉండేది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకోసం ఎక్కువ నిధులను అందించటానికి ఆంగ్లోఇరానియన్ ఆయిల్ కంపెనీ నిరాకరించటంతో మొత్తం చమురు పరిశ్రమను జాతీయం చేశారు. ఆ చర్యతో రగిలిపోయిన బ్రిటన్, అమెరికాలు ఏకమై ఇరాన్‌లోని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోశాయి. అప్పటి నుంచి అమెరికా వ్యతిరేకత ఇరాన్‌లో పాతుకుపోయింది. అమెరికా అండతో ఆ తర్వాత చెలరేగిపోయిన రెజాషాకు వ్యతిరేకంగా ఇరాన్‌లో అన్ని రాజకీయపక్షాలు ఏకమయ్యాయి. అయతుల్లా ఖోమైనీ నాయకత్వంలో సాగిన ఉద్యమం వల్ల 1979లో రెజాషా ప్రభుత్వం కూలిపోయింది. యురేనియం శుద్ధి కార్యక్రమాలను ఆపినంత మాత్రాన ఇరాన్‌ను తనమానాన తనని ఉండనిస్తారా? అన్నది ఇప్పటికీ సందేహమే. అమెరికా, ఇజ్రాయెల్ ప్రాబల్యానికి ఎదురీది నిలబడి మధ్యప్రాచ్యంలో తన ప్రభావాన్ని పెంచుకోటానికి ఇరాన్ ప్రయత్నించింది. అంతటితో ఆగలేదు. వీలైనప్పుడల్లా ఆ రెండు దేశాల ప్రయోజనాలను దెబ్బతీయటానికి పావులనూ కదిపింది. చర్యకు ప్రతిచర్యగా దాన్ని ఇరాన్ పాలకులు సమర్థించుకున్నా అంతిమంగా నష్టపోయింది మాత్రం ప్రజలే. బాహ్య శత్రువులను చూపి అంతర్గతంగా ప్రజాస్వామ్యాన్ని లేకుండా ఇరాన్ పాలకులు చేయగలిగారు. ఆర్థిక సమస్యల ఆధారంగా రాజకీయాలు బలపడకుండా ఉండటానికి మతోన్మాదాన్ని అంతకంతకూ పెంచటానికే ప్రయత్నించారు తప్ప నిజమైన ప్రజాస్వామ్యం వైపు మొగ్గలేదు. అవసరమైన ఆర్థిక, రాజకీయ సంస్కరణలనూ చేపట్టలేదు. అన్ని నిరసనలనూ అమెరికా, ఇజ్రాయెల్ ప్రేరితాలుగా ఆరోపిస్తూ కాలం గడిపారు. అమెరికా జోక్యం పెరిగినప్పుడూ, బెదిరింపులకు పాల్పడినప్పుడూ, ఇజ్రాయెల్‌తో బాంబుదాడులు చేయించినప్పుడూ ఇరాన్ ప్రజలు ప్రదర్శించే సంఘటిత శక్తి మతనాయకులకే అనుకూలిస్తోంది. పాలకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నప్పటికీ తమ దేశ అస్తిత్వం ప్రమాదంలో పడిందన్న భావనను ఇరాన్ ప్రజలు భరించలేరు. సుదీర్ఘచరిత్రనూ, గతంలోని సామ్రాజ్య ఘనతనూ, పర్షియన్ నాగరికత దేశదేశాల్లో ప్రసరించిన వెలుగునూ నిరంతరం గుర్తుచేసుకునే ఆలోచనాపరులూ, ప్రజలనూ కలిగిన దేశాన్ని లొంగదీయటం అంత తేలికకాదు. ఇరాక్‌తో సహా అనేక మధ్యప్రాచ్యదేశాలు వందేళ్లకు ముందు ఉనికిలోనే లేవు. బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమకు ఇష్టం వచ్చినట్లు గీసిన పటాల (మ్యాప్‌లు) ప్రకారం అవి ఏర్పడ్డాయి. ఇరాన్ ఆ కోవలోది కాదు. పర్షియాగా దాని అస్తిత్వం అవిచ్ఛిన్నమైనది. పదికోట్లకు చేరుతున్న జనాభాతో, విస్తృత భూభాగంతో, పోరాటాల చరిత్రతో..

శతాబ్దాల ఉనికి ఉన్న దేశాన్ని బాంబులతో కాకుండా బంధాలతో గెలవగలిగితే మధ్యప్రాచ్యంలో శాంతిదీపం వెలుగుతుంది. 2015 నాటి అణు ఒప్పందాన్ని పునరుద్ధరిస్తే అందరూ ఆశించే బంధాలు కొంతైనా బలపడతాయి. ఒకనాడు అక్కడి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చి తొలిపాపానికి పాల్పడింది అమెరికానే. అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలగి మలిపాపానికి పాల్పడిందీ అమెరికానే.

కానీ ప్రాయశ్చిత్తాన్ని ఇరాన్ భరించాలనటమే అమెరికా అతినేర్పరితనం!

# రూపు మారుతున్న గ్రామీణ భారతం

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక. ఇక్కడ చిన్న, సన్నకారు రైతులు అంటే రెండు హెక్టార్లలోపు భూమి ఉన్నవారే అధికం. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కానీ, పండించిన పంటలకు కనీస మద్దతు ధర మాత్రం లభించడం లేదు. దీనికి తోడు మార్కెట్‌లో ధరల అస్థిరత, వర్షాధార వ్యవసాయం, వాతావరణ మార్పుల ప్రభావం వంటి కారణాలు రైతుల అప్పులు పెరగడానికి, ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. 1991 తరువాత మన దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో, 2014 తరువాత వ్యవసాయ రంగంపై ప్రభుత్వ పెట్టుబడులు భారీగా తగ్గాయి. ప్రభుత్వ రుణపరపతి తగ్గుతూ వచ్చింది. ప్రైవేట్ వడ్డీ, మార్కెట్ ఆధారిత విధానాలు పెరిగాయి. రైతులు గ్లోబల్ ధరల ప్రభావానికి గురవుతున్నారు. వీటితో రైతుల అప్పులు, యువత వలస, సామాజిక అసమానతలు వంటివి చోటుచేసుకుంటున్నాయి. ఈ కాలంలోనే భూసంబంధాలలో అనేక మార్పులు జరిగాయి. కొద్దిమంది వద్ద భూమి కేంద్రీకృతమవడం, ఎక్కువ మందికి భూమి లేకపోవడం అతిపెద్ద మార్పు. 201819 నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ నివేదిక ప్రకారం, గ్రామీణ ప్రాంతంలో 20శాతం ధనికుల వద్ద 76శాతానికి పైగా భూమి ఉంది. 41శాతం కుటుంబాలకు ఎటువంటి భూమీ లేదు. సెంటు భూమి కూడా లేని కుటుంబాలు దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 54.4 శాతం, తెలంగాణలో 42.5శాతం ఉన్నాయి. ఇదే నివేదిక ప్రకారం సామాజిక అసమానతలు కూడా బాగా పెరుగుతున్నాయి. 57.3శాతం మంది దళితులు, 32.8శాతం ఆదివాసీలు, 53.1శాతం ముస్లింలు భూమిలేని పేదలుగా ఉన్నారు. 'ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్' అనే సంస్థ సర్వే ప్రకారం, గ్రామీణ ప్రాంతంలో కేవలం 5శాతం సంపన్నులు 60శాతం సంపదను కలిగి ఉన్నారు. సీలింగ్ భూములలో కూడా నేటికీ 18 లక్షల ఎకరాల భూమి వీరి నుంచి సేకరించలేదు. అలాగే 60 లక్షల ఎకరాల బంజరు భూమి అందుబాటులో ఉన్నా, అర్హులకు పంచలేదు. 5 లక్షల ఎకరాల భూదాన భూముల పంపకం ప్రశ్నార్థకంగా మిగిలింది. అందులో 1.4 లక్షల ఎకరాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం2006కు అనుగుణంగా జూన్ 2025 నాటికి 51.2 లక్షల అర్జీలు రాగా, 25.1 లక్షలు అంటే సగం పరిష్కారం కాలేదు. వీటికి తోడు వివిధ ప్రాజెక్టుల పేరున పెద్దఎత్తున జరుగుతున్న భూసేకరణ, ల్యాండ్ పూలింగ్ ద్వారా అనేక మంది చిన్న, సన్నకారు రైతులు ఉన్న కొద్దిపాటి భూమినీ కోల్పోతున్నారు. క్రమంగా వ్యవసాయేతర కూలీలుగా మారిన వీరికి ఇస్తున్న వేతనాలు కూడా చాలా తక్కువ. 'లేబర్ బ్యూరో' జూన్ 2025 నివేదిక ప్రకారం, పురుషులకు రోజు కూలి రూ.418, మహిళలకు రూ.334 మాత్రమే ఉంది. అంటే, గ్రామీణ పేదరికం మరింతగా పెరుగుతోంది. ఒకప్పుడు ప్రభుత్వ నియంత్రణలో ఉండే వ్యవసాయం ఇప్పుడు మార్కెట్ ఆధారితం అయింది. విత్తనాలు, ఎరువులు, యంత్రాలు వంటివి కార్పొరేట్ సంస్థల నియంత్రణలోకి వెళ్లాయి. రైతు ఉత్పత్తిదారుడు అయినా, లాభం ఎక్కువగా మధ్యవర్తులు, కంపెనీలకే వెళ్తోంది. చిన్న ఉత్పత్తిదారులు అప్పుల వల్ల భూమి కోల్పోతూ కూలీలవుతున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో చిన్న రైతుల శ్రామిక వర్గీకరణ ఏర్పడింది. రైతు శ్రమ ద్వారా సృష్టించిన విలువలో సింహభాగాన్ని మార్కెట్, వడ్డీ వ్యాపారస్థులు, వాణిజ్య కంపెనీలు తీసుకుంటాయి. ఇది ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్ష దోపిడీ రూపం. అందువల్ల గ్రామీణ సంక్షోభం అనేది 'నయా ఉదారవాద అభివృద్ధి విధానం' సృష్టించిన అంతర్గత వైరుధ్యం. గ్రామీణ ప్రాంతంలోని ఈ విధానాల వల్ల 19972022 మధ్య అధికారిక లెక్కల ప్రకారమే మూడు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఉదారవాద విధానాల కాలంలో కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ పరిశోధనలు, విత్తనాల తయారీ, ఎరువుల అమ్మకం, ఫ్యూచర్ ట్రేడింగ్ వంటి వ్యవసాయ రంగాలలో ప్రవేశించడం, ప్రభుత్వం క్రమేణా వాటన్నింటి నుంచీ వైదొలగడంతో కార్పొరేట్ వ్యవసాయ ప్రోత్సాహం, కాంట్రాక్ట్ ఫార్మింగ్ వంటివి రైతును మార్కెట్ ఆధీనంలోకి మరింతగా నెట్టాయి. 2014 తరువాత ప్రభుత్వ రంగంలో ఎరువుల తయారీ తగ్గి, దిగుమతులపై ఆధారపడడంతో ఈ సంక్షోభం మరింత పెరిగింది. 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రైతుల కష్టాలను మరింత పెంచింది. 2013 భూసేకరణ చట్టాన్ని సవరించడానికి శత విధాలా ప్రయత్నించి, అది సాధ్యం కాకపోవడంతో, అనేక విధాలుగా తూట్లు పొడుస్తోంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల కనుగుణంగా కనీస మద్దతు ధరను ఇవ్వడానికి నిరాకరిస్తూ, మరో పక్క కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించేలా మూడు నల్ల చట్టాలను చేసింది. రైతుల సుదీర్ఘ పోరాటంతో వాటిని వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించినా, ఆచరణలో అవే విధానాలను కొనసాగిస్తోంది. ఈ పోరాటం బలంగా సాగిన దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో 2024 పార్లమెంటు ఎన్నికలలో మోదీ ప్రభుత్వం భారీ మూల్యమే చెల్లించుకోవలసి వచ్చింది. శ్రామికులకు ఏ హక్కులూ లేకుండా చేసి, కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చడమే నయా ఉదారవాద ఆర్థిక విధానాల సారం. దానికనుగుణంగానే లేబర్ కోడ్‌లు, గ్రామీణ ఉపాధి హామీ రద్దు వంటివి. ఈ విధానాలు దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయి.

## హైకోర్టులో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులపై విచారణ,

### ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగింపు.

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌లో, జీఓ 252 మరియు సవరించిన జీఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే, జీఓ 252 మరియు సవరించిన జీఓ 103పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడగింపును స్వాగతిస్తూ, ఇది తాత్కాలిక ఊరట మాత్రమేనని, జర్నలిస్టులకు న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్.



హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ గా చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దార్లు నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి అదనపు కలెక్టర్, అధికారులు ఘనంగా స్వాగతం పలికి పూల మొక్కలు పుష్పగుచ్చాలను అందించారు. జిల్లా కలెక్టర్ గా కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పని చేసిన స్నేహ శబరీష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్ గా వెళ్ళగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.

## అక్రీడేషన్ జిల్లా కమిటీ మెంబర్ల కోసం దరఖాస్తు చేయండి.

జిల్లాలోని మీడియా ప్రతినిధులకు 2026-28 సంవత్సరాలకు కొత్త అక్రిడేషన్ ల జారీ కొరకు నూతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీలో సభ్యత్వం పొందేందుకు జి ఓ 252 ప్రకారం జిల్లాలోని మీడియా అసోసియేషన్లు, సంఘాలు తమ ప్రతినిధి పేరున ఒరిజినల్ లెటర్ ప్యాడ్ పై రాసి ఫిబ్రవరి 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

1. బిగ్ తెలుగు డైలీ నుండి ఒక ప్రతినిధి.
2. ఉర్దూ డైలీ నుండి ఒక ప్రతినిధి
3. మీడియం డైలీ నుండి ఒక ప్రతినిధి
4. స్మాల్ డైలీ నుండి ఒక ప్రతినిధి
5. ఎలక్ట్రానిక్ మీడియా నుండి ఒక ప్రతినిధి
6. వీడియో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి
7. ఫోటో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి.

పై సూచించిన ప్రతినిధులు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 252 లోని రూల్ 3, సబ్ రూల్ 1(సి) ప్రకారం ఫుల్ టైం జర్నలిస్ట్ అయి ఉండాలనీ, ప్రభుత్వ నిబంధనలు, జీవో ప్రకారం మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా బిగ్ డైలీ ప్రతినిధి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధికి 10 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి, మిగిలిన ప్రతినిధులకు కనీసం 5 సంవత్సరాల మీడియా రంగంలో అనుభవం కలిగి ఉండాలి. నిబంధనల ప్రకారం జిల్లాలోని అసోసియేషన్ లు, సంఘాలు తమ ప్రతినిధుల పేర్లను ఫిబ్రవరి.27 మధ్యాహ్నం 2 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి, హన్మకొండ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

## వధూవరులను ఆశీర్వదించిన టిఎన్జీవోస్ నేతలు.



టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ లలిత కుమార్తె వివాహం సహస్ర నవ్యశ్రీ, ఆకాష్ తో మార్వెల్ ఫంక్షన్ హాల్‌లో నారాయణగూడ అంగరంగ వైభవంగా జరిగింది. జేఏసీ కమిటీ చైర్మన్, టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ అధ్యక్షుడు మర్రం జగదీశ్వర్, జేఏసీ సెక్రటరీ జనరల్, టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ అధ్యక్షుడు శ్రీనివాస్, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్, టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్ ఎం హుస్సేని ముజీబ్ లు నూతన వధూవరులకు పుష్ప గుచ్చం అందజేసి ఆశీర్వదించారు. టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ ట్రెజరర్ సత్యనారాయణ గౌడ్, టీఎన్జీవోస్ యూనియన్ నగర అధ్యక్షుడు శ్రీకాంత్, టీఎన్జీవోస్ యూనియన్ ప్రచార కార్యదర్శి శైలజ, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు, టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, ఫోరం జాయింట్ సెక్రటరీ సుదర్శన్ లు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం అందజేసి ఆశీర్వదించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com